# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 258 | గురువారం 4 ఏప్రిల్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# రేవంత్ సర్కార్ వేట!

- పదేళ్లలో చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికి తీసే ప్రయత్నం
- కాళేశ్వరంపై రిటైర్డ్ జడ్జితో విచారణకు నియమించిన సర్కార్
- మరోవైపు కేసీఆర్ సర్కార్ చేసుకున్న ఒప్పందాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు
- విద్యుత్ ఒప్పందాలు, కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో అవినీతి తదితర వాటిపైనా ఆరా తీస్తున్నారు.



## కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడమే లక్ష్యంగా..

కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ వేట కొనసాగిస్తోంది. పదేళ్లలో చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికి తీసే ప్రయత్నం చేస్తోంది. ఆరోపణలు ఉన్న ప్రతీ కేసుపై విచారణ జరిపిస్తోంది. ఈ క్రమంలోనే కాళేశ్వరంపై రిటైర్డ్ జడ్జితో విచారణకు నియమించారు. తర్వాత ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దానిపైనా విచారణ కొనసాగుతోంది. మరోవైపు కేసీఆర్ సర్కార్ చేసుకున్న ఒప్పందాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. విద్యుత్ ఒప్పందాలు, కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో అవినీతి తదితర వాటిపైనా ఆరా తీస్తున్నారు.

-3లో



# ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకు వస్తారు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదు
- ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకి వస్తారు
- అందరి ఫోన్‌లు ట్యాప్ చేశారు
- విచారణలో అన్నీ బయటకు వస్తాయి
- తమ ప్రభుత్వం గురించి కేటీఆర్ రైతులను అడిగితే తెలుస్తుంది
- తాము ఏం చేస్తామో సంవత్సరంలో చేసి చూపిస్తాం
- మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ అంశం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఫోట్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా ఈ అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకి వస్తారన్నారు. అందరి ఫోన్‌లు ట్యాప్ చేశారని.. విచారణలో అన్నీ బయటకు వస్తాయని తెలిపారు. కేటీఆర్ నోటీసులు ఇచ్చుకుంటే ఇచ్చుకో అని అన్నారు. తాము పద్దతి ప్రకారం పనిచేస్తామన్నారు. మిషన్ భగీరథ తప్పుడు స్కీం అని వ్యాఖ్యలు చేశారు. తాము తెచ్చిన వాటర్ మేకానిజం కంటిన్యూ చేయొద్దని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తప్పు అని అన్నారు. తమ ప్రభుత్వం గురించి కేటీఆర్ -మిగతా3లో

# బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయింది




- బీజేపీ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది
- ఇదే అదనుగా అందరం కలిసికట్టుగా పనిచేసి మెదక్ సీటును కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే విధంగా కృషి చేద్దాం
- కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అమలుతో ప్రజల్లో పార్టీ పట్ల సానుభూతి పెరిగింది
- ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ మనకు ఎంతో ప్రతిష్ఠాత్మకం..
- సీటును గెలుచుకుందాం: రేవంత్ రెడ్డి
- కష్టపడండి.. కలిసికట్టుగా ముందుకు సాగండని పిలుపు
- మెదక్‌లో పార్టీకి పూర్వవైభవం తీసుకుని వద్దామన్న రేవంత్ రెడ్డి
- సీటును కాంగ్రెస్ ఖాతాలో వేద్దామన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్

ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ స్థానం మనకు ఎంతో ప్రతిష్ఠాత్మకమని... ఈ స్థానంలో పార్టీని గెలిపించి పూర్వవైభవం తీసుకువద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి నివాసంలో మెదక్ పార్లమెంట్ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జ్‌లు, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, బీజేపీ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందన్నారు. ఇదే అదనుగా అందరం కలిసికట్టుగా పనిచేసి మెదక్ సీటును కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే విధంగా కృషి చేద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అమలుతో ప్రజల్లో పార్టీ పట్ల సానుభూతి పెరిగిందన్నారు. ఎన్నికల ప్రచారంలో మన పథకాలే ప్రచారాస్త్రాలుగా విజయం సాధించడానికి కృషి -మిగతా3లో


## భీకర ఎన్‌కౌంటర్‌లో 13 మంది నక్సల్స్ హతం

- భద్రతాదళాలకు, నక్సల్స్ మధ్య హోరాహోరీగా కాల్పులు
- పలువురు నక్సల్స్ గాయాలు
- పలువురు నక్సల్స్ గాయపడినందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- ఏప్రిల్ 1, 2వ తేదీల్లో కొనసాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 13 మంది నక్సల్స్ హతం



# కాంగ్రెస్‌కు సైబర్ ఝలక్

- ఎంపీ అభ్యర్థులకు సైబర్ నేరగాళ్లు ఝలక్
- భీ ఫాంలు ఇస్తామంటూ ఫోన్..
- పార్టీ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఫోన్లు రావడంతో అభ్యర్థులు ఒక్కసారిగా టెన్షన్
- ఫోన్ చేసి మీకు భీ ఫాంలు ఇస్తాం రూ.99వేలు చెల్లించి తీసుకోవాలని చెప్పడంతో నిజమని నమ్మిన అభ్యర్థులు
- నుమానంతో గాంధీ భవన్‌కు పోన్ చేసి అడగడంతో



హైదరాబాద్

ఎన్నికల వేళ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులకు సైబర్ నేరగాళ్లు ఝలక్ ఇచ్చారు. ఎన్నికలకు సంబంధించి పార్టీ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఫోన్లు రావడంతో అభ్యర్థులు ఒక్కసారిగా టెన్షన్ పడ్డారు. ఫోన్ చేసి మీకు భీ ఫాంలు ఇస్తాం రూ.99వేలు చెల్లించి తీసుకోవాలని చెప్పడంతో నిజమని నమ్మారు. ఫోన్ పే నెంబర్‌కు డబ్బులు చెల్లించాలని అడగడంతో అనుమానంతో గాంధీ భవన్‌కు పోన్ చేసి అడగడంతో అసలు విషయం బయటపడింది. దీంతో గాంధీ భవన్ నుంచి ఎంపీ అభ్యర్థులకు ఫోన్లు చేసి ఢిల్లీ నుంచి పార్టీ ప్రతినిధులు ఎవరూ కాల్స్ చేయడం లేదని, ఎటువంటి డబ్బులు ఎవరికి చెల్లించవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్లు మొదట తెలంగాణ -మిగతా3లో

# ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ సృష్టించిన కొరత

- 'అసమర్థ ముఖ్యమంత్రికి డబ్బు తరలించడంలో ఉన్న శ్రద్ధ
- జల వనరులను తరలించడంపై లేదు




హైదరాబాద్

సీఎం రేవంత్ ఢిల్లీకి నిధులు పంపించడంలో బిజీగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. జల వనరులను తరలించడంపై సీఎం రేవంత్‌కు అసలు శ్రద్ధ లేదని అన్నారు. వేసవి ఆరంభంలోనే తాగునీటి కోసం తన్నులాటలు షురూ అయ్యాయని చెప్పుకొచ్చారు. కాగా, కేటీఆర్ బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..'అసమర్థ ముఖ్యమంత్రికి డబ్బు తరలించడంలో ఉన్న శ్రద్ధ.. జల వనరులను తరలించడంపై లేదు. సాగునీరు, తాగు నీరు లేక పల్లె ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు, నాలుగు రెట్లు ఎక్కువ ధర చెల్లించి ట్యాంకర్లు బుక్ చేసుకోవాల్సిన దుస్థితి -మిగతా3లో

# ప్రపంచ కుబేరుల జాబితాలో భారతీయ మహిళకు చోటు..

భారత్‌లో సంపన్నుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. ఇటీవల ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ సంపన్నుల జాబితాలో కొత్తగా 25 మంది భారతీయ బిలియనీర్లు అడుగుపెట్టారు. వీరిలో 4.8 బిలియన్ డాలర్ల విలువైన నికర సంపదతో రేణుకా జగ్తియానీ అనే మహిళ కూడా ఉన్నారు. దుబాయ్ వేదికగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కన్స్యూమర్ ఉత్పత్తుల కంపెనీ 'ల్యాండ్‌మార్క్ గ్రూప్'కు ఆమె చైర్‌ఉమెన్‌గా, సీఈవోగా ఉన్నారు. ఈ కంపెనీని రేణుకా జగ్తియాని భర్త మిక్కీ జగ్తియాని స్థాపించారు. అయితే గతేడాది మే నెలలో ఆయన చనిపోయిన నాటి నుంచి రేణుకా జగ్తియాని తన మార్గదర్శకత్వంలో కంపెనీని నడిపిస్తున్నారు. 50,000 మందికి పైగా ఈ కంపెనీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. మధ్యప్రాచ్య దేశాలు, భారత ఉపఖండం, ఆగ్నేయాసియా, ఆఫ్రికా దేశాల్లో విస్తరణ కోసం రేణుకా జగ్తియాని కృషి చేస్తున్నారు. కాగా ముంబై



విశ్వవిద్యాలయం నుంచి ఆర్ట్స్ విభాగంలో ఆమె బ్యాచిలర్ డిగ్రీ చేశారు. 1993లో ల్యాండ్‌మార్క్ కంపెనీలో ఆమె అడుగుపెట్టారు. కుటుంబం విషయానికి వస్తే ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరి పేర్లు ఆర్తి, నీషా, రాహుల్. వీరు ముగ్గురూ గ్రూప్ డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు.

**ఎన్నో అవార్డులు అందుకున్న రేణుకా..**

నిబద్ధత, అంకితభావంతో పనిచేసే రేణుకా జగ్తియానిని పలు అవార్డులు వరించాయి. జనవరి 2007లో ఏషియన్ బిజినెస్ మిడిల్ ఈస్ట్ అవార్డ్స్‌లో అత్యుత్తమ 'ఏషియన్ బిజినెస్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'ను అందుకున్నారు. జనవరి 2012లో గల్ఫ్ బిజినెస్ ఇండస్ట్రీ అవార్డ్స్‌లో 'బిజినెస్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్', 2014లో 'వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్ అవార్డ్స్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తగా గౌరవం పొందారు. ఇక జనవరి 2015లో ఇండియన్ సీఈవో అవార్డ్స్‌లో 'స్ట్రాటజిక్ లీడర్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచారు. జనవరి 2017లో వరల్డ్ రిటైల్ కాంగ్రెస్‌లో 'హాల్ ఆఫ్ ఫేమ్'లో ఆమె పేరుని చేర్చారు. కాగా మధ్యప్రాచ్య దేశాలు, భారత ఉపఖండం, ఆగ్నేయాసియా, ఆఫ్రికా దేశాల్లో 'ల్యాండ్‌మార్క్' కంపెనీ విస్తరణ కోసం ఆమె కృషి చేస్తున్నారు.

## భీకర ఎన్‌కౌంటర్‌లో 13 మంది నక్సల్స్ హతం



**బిజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతాదళాలకు, నక్సల్స్ మధ్య హోరాహోరీగా జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 13 మంది నక్సల్స్ హతమయ్యారు. పలువురు నక్సల్స్ గాయపడ్డారు. మంగళవారం నాడు మొదలైన ఈ ఎన్‌కౌంటర్ బుధవారంతో ముగిసిందని భద్రతా బలగాలు ఒక అధికారిక ప్రకటనలో తెలిపాయి. పలువురు నక్సల్స్ గాయపడినందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పాయి. బిజాపూర్ ఎన్‌కౌంటర్ వివరాలను బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ తెలియజేస్తూ, నక్సల్స్ ఏరివేత ఆపరేషన్లలో ఇది పెద్ద విజయమని అన్నారు. గంగలూరులో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో వెయ్యి మందికి పైగా భద్రతా బలగాలు పాల్గొన్నట్టు చెప్పారు. ఏప్రిల్ 1, 2వ తేదీల్లో కొనసాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 13 మంది నక్సల్స్ హతమయ్యారని, వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పెద్ద సంఖ్యలో నక్సల్స్ గాయపడినట్టు సమాచారం ఉందన్నారు. ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్న ప్రాంతం నక్సల్స్‌కు సురక్షిత ప్రాంతంగా ఉందని, గత మూడు నెలల్లో కొత్తగా 16 భద్రతా శిబిరాలు ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు. బలగాలు సుమారు 20 కిలోమీటర్ల మేర అడవులు, పర్వతాల మీదుగా బలగాలు ప్రయాణించి, నైట్ విజన్ బైనాక్యులర్లు, అధునాతన ఆయుధాలతో ఈ ఆపరేషన్ నిర్వహించినట్టు చెప్పారు. వెస్ట్ బస్తర్ డివిజన్ గంగలూర్ ఏరియా కమిటీకి చెందిన కంపెనీ-2 ఇచ్చిన సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టామని, నక్సలైట్ ఆర్గనైజేషన్‌లో నెంబర్ 2గా అత్యంత శక్తివంతమైన గ్రూప్‌ను బిజాపూర్ జిల్లాలో కనుగొన్నామని ఐజీ చెప్పారు. రెండు రాత్రుల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో మంగళవారం వరకూ 10 మంది నక్సల్స్ మృతదేహాలను, బుధవారం ఉదయం మరో 3 మృతదేహాలను, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మృతులలో మహిళలు సైతం ఉన్నట్టు చెప్పారు.

## వయనాడ్ నుంచి నామినేషన్ వేసిన రాహుల్ గాంధీ



**తిరువనంతపురం:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి బుధవారం నామినేషన్ వేశారు. వయనాడ్ నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాహుల్.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి ఇక్కడి నుంచి బరిలో నిలిచారు. ఈ క్రమంలోనే నేడు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాహుల్ వెంట తన సోదరి ప్రియాంక గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ఇతర పార్టీ సీనియర్ నేతలు కూడా ఉన్నారు. కాగా బుధవారం ఉదయం వయనాడ్ చేరుకున్న రాహుల్.. కాల్‌పేట నుంచి సివిల్ స్టేషన్ వరకు రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మాట్లాడుతూ.. తాను ఎల్లప్పుడూ వయనాడ్ ప్రజలతో ఉంటానని చెప్పారు. ఇక్కడి ప్రతివ్యక్తి తనపై ప్రేమ, అభిమానాన్ని అందించారని, సొంత వ్యక్తిలా చూసుకున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తుండటం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఇక 2019 ఎన్నికల్లో వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ ఏడు లక్షల ఓట్లతో గెలుపొందారు. సమీప అభ్యర్థి సీపీఐ అభ్యర్థి సునీర్‌పై 4.31 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇదే వయనాడ్ నుంచి బీజేపీ తరపు రాష్ట్ర అధ్యక్షుడు కే సురేంద్రన్, సీపీఐ నేత అనీ రాజా పోటీలో నిలిచారు. రెండో ఫేజ్‌లో భాగంగా ఏప్రిల్ 26న కేరళలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

# జపాన్ టూర్ ఇక ఈజీ!

భారతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా జపాన్ 'ఈ-వీసా'ను ప్రవేశపెట్టింది. దీంతో పర్యాటకులు తమ పాస్‌పోర్టులలో భౌతిక స్టిక్కర్ల అవసరం లేకుండా ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఏప్రిల్ 1, 2024 నుంచే ఈ-వీసా జారీ ఆరంభమైంది. ఈ కొత్త ప్రోగ్రామ్‌లో భారతీయ పర్యాటకులు ఆన్‌లైన్‌లోనే వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీఎఫ్ఎస్ గ్లోబల్ ద్వారా నిర్వహిస్తున్న జపాన్ వీసా అప్లికేషన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. పర్యాటకుల సౌలభ్యం కోసం ప్రవేశపెట్టిన ఈ-వీసా ప్రోగ్రామ్‌లో వీసా పొందినవారు జపాన్‌లో గరిష్ఠంగా 90 రోజులు పర్యటించవచ్చు. అయితే జపాన్‌లోకి ఎంట్రీ మాత్రం ఒకే ఒక్కసారి ఉంటుంది. అర్హత కలిగివున్న భారతీయులతో పాటు ఇండియాలో నివసిస్తున్న విదేశీయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. జపాన్‌ను సందర్శించాలనుకునే భారతీయులు ఇకపై తమ పాస్‌పోర్ట్‌లపై భౌతిక వీసా స్టిక్కర్లను పొందాల్సిన అవసరం లేదు. ఏప్రిల్ 1 నుండి, జపాన్ భారతీయ పర్యాటకుల కోసం ఈ-వీసాల జారీని ప్రారంభించింది. పర్యాటకులు చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఈ జపాన్ ఈ-వీసా ప్రోగ్రామ్.. వీఎఫ్ఎస్ గ్లోబల్ ద్వారా నిర్వహిస్తున్న జపాన్ వీసా దరఖాస్తు కేంద్రాల ద్వారా ఎలక్ట్రానిక్ పద్ధతిలో వీసాలకు దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ వీసా ప్రోగ్రామ్ ప్రత్యేకంగా పర్యాటక ప్రయోజనాల కోసం సింగిల్-ఎంట్రీ స్వల్పకాలిక వీసాను అందిస్తుంది. జపాన్‌లో గరిష్టంగా 90 రోజుల పాటు ఉండేందుకు వీలు కల్పిస్తుంది. భారతదేశంలో నివసిస్తున్న భారతీయ పౌరులు, విదేశీ పౌరులు ఈ ఈ-వీసాకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

**వీసా కేంద్రానికి వెళ్లాల్సిన పనిలేదు**

కొత్త విధానం ప్రకారం.. పర్యాటకులు తమ దరఖాస్తులను మునుపటి ప్రక్రియ మాదిరిగానే వీఎఫ్ఎస్ గ్లోబల్ నిర్వహించే వీసా దరఖాస్తు కేంద్రాలకు సమర్పించాలి. అయితే తమ పాస్‌పోర్ట్‌లకు సాంప్రదాయ వీసా స్టిక్కర్‌ను అతికించుకునేందుకు వీసా కేంద్రానికి వెళ్లాల్సిన పని లేదు. విజయవంతమైన దరఖాస్తుదారులకు నేరుగా వారి ఫోన్‌కే ఎలక్ట్రానిక్ వీసా వస్తుంది. ప్రయాణికులు విమానాశ్రయానికి



చేరుకున్న తర్వాత తమ ఫోన్‌లలో "వీసా జారీ నోటీసు"ని చూపించాలి. ఈ దశకు ఇంటర్నెట్ యాక్సెస్ అవసరమని గమనించడం ముఖ్యం. డిజిటల్ వీసా జారీ నోటీసు కాకుండా పీడీఎఫ్, ఫోటో, స్క్రీన్‌షాట్ లేదా ప్రింటెడ్ కాపీలను అనుతించరు.

**దరఖాస్తు చేసుకునే విధానం ఇదే..**

1. జపాన్ వీసా అధికారిక వెబ్‌సైట్ https://visa.vfsglobal.com/ind/en/jpn ను సందర్శించాలి.
2. అప్లికేషన్ ఫామ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పొందుపరచాలి. ఫొటోలతో సహా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి.
3. అప్లికేషన్‌ను సమర్పించడానికి అపాయింట్‌మెంట్ తేదీని బుక్ చేసుకోవాలి. దీంతో అపాయింట్‌మెంట్ లెటర్‌తో కూడిన ఈ-మెయిల్ వస్తుంది.
4. దరఖాస్తును అందజేసి.. నిర్ణయం కోసం వేచిచూడాల్సి ఉంటుంది. వీసా అప్లికేషన్ స్టేటస్‌ని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసుకోవచ్చు.
5. విజయవంతంగా ఎంపికైన దరఖాస్తుదారులకు ఎలక్ట్రానిక్ వీసా జారీ అవుతుంది.
6. ప్రయాణ సమయంలో ఎయిర్‌పోర్టుల వద్ద చెక్-ఇన్ సమయంలో తమ డివైజ్‌లలోని వీసా చూపించాల్సి ఉంటుంది. ఈ-వీసాపై ఉన్న డిస్‌ప్లే ఆప్షన్ మీద క్లిక్ చేస్తే సరిపోతుంది.

# కాంగ్రెస్‌కు భారీ షాక్.. బీజేపీలో చేరిన బాక్సర్ విజేందర్ సింగ్




**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. ప్రముఖ భారత బాక్సర్ విజేందర్ సింగ్ బుధవారం బీజేపీలో చేరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు కాగా 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు విజేందర్ సింగ్ కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం పార్టీ అధిష్టానం ఈ యువ బాక్సర్‌ను దక్షిణ ఢిల్లీ స్థానం నుంచి బరిలోకి దించింది. అయితే, ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరి చేతిలో ఓడిపోయారు. అయితే ఈ సారి విజేందర్‌ను సింగ్ దక్షిణ ఢిల్లీ నుంచి కాకుండా ఉత్తర్ ప్రదేశ్లోని మధుర లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దించాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ తరుణంలో బాక్సర్ విజేందర్ సింగ్ బీజేపీలో చేరడంతో ఢిల్లీ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇక మధుర నుంచి నుంచి బీజేపీ తరపున నటి హేమమాలిని పోటీ చేస్తున్నారు. ఇప?్పటికే ఆమె 2014, 2019 ఎన్నికల్లో వరుస విజయాల్ని సొంతం చేసుకున్నారు. అయితే హేమమాలినికి చెక్ పెట్టేందుకు జాట్ వర్గం ప్రభావం ఎక్కువ ఉండి, అదే వర్గానికి చెందిన విజేందర్‌ను లోక్‌సభ అభ్యర్థిగా దించాలని కాంగ్రెస్ పెద్దలు భావించారు. కానీ అనూహ్యంగా విజేందర్ సింగ్ బీజేపీలో చేరడం ఉత్తర్ ప్రదేశ్ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. జాట్ వర్గం ప్రభావం ఎక్కువగా చూపే హర్యానా, పశ్చిమ యూపీలలో బాక్సర్ విజేందర్ సింగ్ బీజేపీ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలుస్తోంది.

# తైవాన్‌ను కుదిపేసిన భారీ భూకంపం

తైవాన్ ను ఇవాళ భారీ భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రత నమోదైంది. తైవాన్ లో దాదాపు పాతికేళ్ల తర్వాత ఈ స్థాయిలో భూకంపం సంభవించడం ఇదే ప్రథమం. తాజా భూకంపం ధాటికి ఇప్పటివరకు ఏడుగురు మరణించారు. 736 మంది గాయపడ్డారు. 77 మంది టన్నెల్స్ లో చిక్కుకుపోయారు. వందల సంఖ్యలో ప్రజలు తమ వాహనాలు సహా హైవేలపై నిలిచిపోయారు. చాలాచోట్ల భవనాలు ఒరిగిపోయాయి. అనేక చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తైవాన్ భూకంపానికి సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ ఫ్లైఓవర్ పై వాహనాలు వెళుతుండగా, ఒక్కసారిగా రోడ్డు ఊయలలా ఊగిపోవడం వీడియో



లో రికార్డయింది. దాంతో రోడ్డుపై వాహనాలు ఎక్కడి వక్కడే ఆగిపోయాయి. అయినప్పటికీ, భూ ప్రకంపనల కారణంగా రోడ్డు ఊగిపోయింది. ఇలా కొన్ని సెకన్ల పాటు సాగింది.

## తగినంత సమయం ఇస్తాం.. అందరి వాదనలు వింటాం.. సుప్రీంకోర్టు..



భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ అంటే చాలా కష్టంతో కూడుకున్న ప్రక్రియ. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గుజరాత్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు ప్రతి పోలింగ్ బూత్ లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసుకోవాలి. గతంలో బ్యాలెట్ విధానంలో ఎలక్షన్లు జరిగేవి. కానీ మారుతున్న కాలంలో ఈవీఎంలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈవీఎంల పనితీరుపై ప్రతిపక్ష పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈవీఎంలోని ఓట్లతో పాటు వీవీపాట్ స్లిప్పులు కూడా లెక్కించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఈ పిటిషన్ ఈరోజు విచారణకు రావాల్సి ఉన్నా లిస్ట్ నుంచి డిలీట్ కావడంతో ప్రస్తావిస్తున్నానన్నారు. లోకసభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్నందున త్వరగా విచారణ జరపాలని కోరారు. ఇప్పుడు విచారణ జరిపి నిర్ణయం తీసుకోలేకపోతే పిటిషన్ నిరర్థకం అవుతుందని మరో సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణ పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న విషయం కోర్టుకు కూడా తెలుసన్నారు. వాదనలు విన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా.. వేగంగా విచారణ చేపట్టడానికి తామూ సిద్ధంగానే ఉన్నామని కానీ ఈ వారం విచారణ చేపట్టడం సాధ్యపడదు అని అన్నారు. రెండు వారాల తర్వాత విచారణ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అందరికీ తగినంత సమయం ఇచ్చి అందరి వాదనలు వింటామని వివరించారు.

## కేజ్రీవాల్ బరువులో మార్పు లేదు



**న్యూఢిల్లీ:** ఢిల్లీ సీఎం, ఆమ్ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ జైలులో బరువు తగ్గలేదని తీహార్ జైలు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జైలు అధికారులు కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిపై ఒక బులెటిన్ విడుదల చేశారు. కేజ్రీవాల్ జైలుకు వచ్చినపుడు 65 కేజీల బరువు ఉండగా ఇప్పుడు కూడా అంతే ఉన్నారని తెలిపారు. రక్తపోటు సాధారణ స్థాయిలోనే ఉందని, షుగర్ లెవెల్స్ మాత్రం హెచ్చుతగ్గులకు గురవతున్నాయని వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టయిన మార్చ్ 22 నుంచి బుధవారం(ఏప్రిల్ 3) వరకు 4.5 కేజీల బరువు తగ్గారని ఆమ్ఆద్మీపార్టీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ బరువులో ఎలాంటి మార్పు లేదని తీహార్ జైలు అధికారులు వెల్లడించడం గమనార్హం.

## లోక్‌సభ ఎన్నికల వేళ బెంగాల్‌లో ఆసక్తి రేపుతున్న 'టీఎంసీ' పోస్టర్లు




**కలకత్తా:** లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మధ్య జరుగుతున్న పోస్టర్ వార్ ఆసక్తిరేపుతోంది. బీజేపీ ఇప్పటికీ అభ్యర్థులను ప్రకటించని అసన్‌సోల్, డైమండ్ హార్బర్ లోక్‌సభ సీట్ల విషయంలో టీఎంసీ గోడలపై పోస్టర్లు వేసింది. క్యాండిడేట్ వాంటెడ్ అని షాడో ఫేస్ ఉన్న పోస్టర్లను వీధుల్లో అంటించారు. దమ్ముంటే బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నేత సువేందు అధికారి డైమండ్ హార్బర్ సీటు నుంచి పోటీ చేయాలని టీఎంసీ సవాల్ విసురుతోంది. ఇక్కడి నుంచి ప్రస్తుతం టీఎంసీ జనరల్ సెక్రటరీ, సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక అసన్‌సోల్ నుంచి బీజేపీ క్యాండిడేట్‌గా ప్రకటించిన పవన్‌సింగ్ మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి పోటీ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి కొనితెచ్చుకున్నారు. దీంతో బీజేపీ ఇక్కడ ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించలేదు. అసన్‌సోల్‌లో పోటీ చేసేందుకు బీజేపీకి అభ్యర్థులే లేరని టీఎంసీ ఎద్దేవా చేస్తోంది. కాగా, పశ్చి?మ బెంగాల్‌లో ఈ నెల 19న తొలి దశ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

## ఎన్నికల వేళ బీజేపీకి తలనొప్పిగా మారిన "రూపాలా"వ్యాఖ్యలు



**అహ్మదాబాద్:** లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కొద్దిరోజుల్లో జరగనుండగా కేంద్రమంత్రి పర్షోత్తమ్ రూపాలా చేసిన వ్యాఖ్యలు గుజరాత్‌లో బీజేపీకి తలనొప్పిగా మారాయి. క్షత్రియులపై పర్షోత్తమ్ రూపాలా వ్యాఖ్యలతో రాజ్‌కోట్‌లో రాజ్‌పుత్ వర్గానికి చెందిన వారు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. రూపాలా ఇంటి ముందు ఆయన దిష్టిబొమ్మను కాల్చారు. దీంతోపోలీసులు రూపాలా ఇంటి వద్ద భద్రత పెంచారు. క్షత్రియులపై తాను చేసిన వ్యాఖ్యలపై రూపాలా క్షమాపణలు చెప్పినప్పటికీ రాజ్‌పుత్‌లు వెనక్కి తగ్గడం లేదు. రాజ్‌కోట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రూపాలాను లోక్‌సభ రేసు నుంచి డిమాండ్ చేస్తున్నారు. మార్చ్ 22 దళితులతో జరిగిన ఓ కార్యక్రమంలో రూపాల గతంలో మహారాజాలను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బ్రిటీష్ వారితో ఒకే కంచంలో తినడంతో పాటు వారికి తమ కూతుళ్లనిచ్చి మహారాజాలు పెళ్లి చేశారని రూపాలా విమర్శించారు. దళితులు మాత్రం బ్రిటీష్ వారి వేధింపులు తట్టుకున్నారని, మతం మాత్రం మారలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు గుజరాత్‌లో దుమారం రేపాయి. రాజ్‌పుత్ కమ్యూనిటీ ఓట్లు బీజేపీలో 17 శాతం మేర ఉంటాయి. ఇవన్నీ మొన్నటిదాకా బీజేపీ ఖాతాలో పడే ఓట్లే. రూపాలా నోటీ నుంచి వచ్చిన వివాదాస్పద వ్యాఖ్యలతో లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఓట్లు తమ పార్టీకి పడతాయా లేదా అని బీజేపీ అధిష్టానం ఆందోళన చెందుతోంది. గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లో రాజ్‌పుత్‌లు ఎన్నికల ఫలితాలను చాలా వరకు ప్రభావితం చేస్తారు.

# ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ సృష్టించిన కొరత

-మొదటి పేజి తరువాయి

నెలకొంది. వేసవి ఆరంభంలోనే తాగునీటి కోసం తన్నులాటలు షురూ అయ్యాయి. ఇది ప్రకృతి కరువు కాదు.. వైఫల్యాల కాంగ్రెస్ సృష్టించిన కొరత ఇది. పార్టీ గేట్లు ఎత్తడం కాదు.. చేతనైతే ముఖ్యమంత్రి ప్రాజెక్ట్‌ల గేట్లు ఎత్తాలి. హైదరాబాద్ చుట్టూ ప్రాజెక్ట్‌ల్లో నీళ్లు ఉన్నా.. నగరంలో నీటి ఎద్దడికి కారుకులు ఎవరు?. మహిళలు ఖాళీ బిందెలతో యుద్ధాలు చేస్తున్నారు. మంచి నీళ్లు మహాప్రభో అంటూ ప్రజలు అల్లాడుతున్నారు. రేవంత్ మాత్రం గొంగు చించుకుని తిడుతున్నారు. 2023లో నవంబర్‌లోనే మేము స్పష్టంగా చెప్పాము. కేసీఆర్ అంటే నీళ్లు.. కాంగ్రెస్ వస్తే కన్నీళ్లు అని. కాళేశ్వరంను విఫల ప్రాజెక్ట్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో 218 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ వివరాలు అన్ని రేవంత్ రెడ్డికి పంపిస్తాం. కాంగ్రెస్‌కు హైదరాబాదీలు ఓటు వేయదు. అది అందరికీ తెలుసు.. అందుకే హైదరాబాద్ ప్రజలపై కక్ష కట్టావా రేవంత్?. నీళ్ల ట్యాంకర్ పంపుతున్న మమ్మల్ని మెచ్చుకోరా అంటున్నాడు. ఒక ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన మాటలా ఇవి. సిగ్గు లేకుండా సీఎం మాట్లాడుతున్నాడు. బుక్ చేసిన వారానికి నీళ్ల ట్యాంకర్లు వస్తున్నాయి. నీకు నిజాయితీ ఉంటే ఫ్రీగా నీళ్ల ట్యాంకర్లు ఇవ్వండి' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్పష్టంగా ఉంది. ఒక పార్టీ గుర్తు మీద పోటీ చేసి గెలిచి, మళ్ళీ వేరే పార్టీలో పోటీ చేయటం రాజ్యాంగ విరుద్ధం. కచ్చితంగా కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై కోర్టుకు వెళ్తాం. ఘన్‌పూర్, ఖైరతాబాద్ లో ఉప ఎన్నిక ఖాయం. మందకృష్ణ మాదిగ ఇదే విషయం మాట్లాడారు. ఆయనకు నా అభినందనలు. అలాగే, ఫోన్ ట్యాపింగ్‌కు నాకు ఎలాంటి సంబంధం లేదు. ఎవరినో హీరోయిన్లను బెదిరించాను అనే ఓ మంత్రి మాట్లాడుతున్నారు. ట్యాపింగ్ వ్యవహారానికి నాకు ఎలాంటి



సంబంధం లేదని మళ్లీ చెబుతున్నాను. లేదు ఇలాగే ఆరోపణలు చేస్తే ఎవరిని వదిలిపెట్టము.. తాట తీస్తాం. నేను ఎవరికీ భయపడను అని వార్నింగ్ ఇచ్చారు.

**మరి ముఖ్యమంత్రిగా నువ్వు ఎందుకు..?**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పరిపాలన తన చేతుల్లో లేదని రేవంత్ రెడ్డి మాట్లాడడం చాలా చిల్లరగా ఉందని కేటీఆర్ మండిపడ్డారు. వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

నిన్న రేవంత్ రెడ్డి తుక్కుగూడలో మీడియాతో మాట్లాడుతూ.. రూ. 2 లక్షల రుణమాఫీ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నాడు. ఇంకా సిగ్గు చేటు ఏంటంటే.. పరిపాలన నా చేతుల్లో లేదు.. ఎలక్షన్ కమిషన్ చేతుల్లో ఉందని రేవంత్ అన్నడు. మరి ముఖ్యమంత్రిగా నువ్వు ఎందుకు..? పరిపాలన అల్టిమేట్‌గా ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉంటది. తాత్కాలికంగా రెండు నెలల పాటు ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎలక్షన్ కమిషన్ సమన్వయం చేస్తుంది. ఇది కూడా రేవంత్ రెడ్డికి తెలియదు. పరిపాలన అనుభవం లేదు కదా..? ఎలా నడుపుతావు అంటే రేవంత్ ఏమన్నారంటే.. ముఖ్యమంత్రి పదవి గుంపు మేస్త్రీ పదవి అని మాట్లాడిండు. ప్రధాన మంత్రేమో తాపీ మేస్త్రీ.. ఇద్దరు కలిసి తెలంగాణకు సమాధి కట్టే పనిలో ఉన్నారు. మన తెలంగాణ పార్టీకి సమాధి కట్టాలని కలిసి పని చేస్తున్నాయని కేటీఆర్ తెలిపారు.

**చేవెళ్లలో కాంగ్రెస్ గెలిచే పరిస్థితి లేదు..**

ఆనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపోళ్లు కాంగ్రెస్‌కు సహకరించారు. ఈ రోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీకి సహకరించే ప్రయత్నం చేస్తున్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ గెలిచే పరిస్థితి లేదని తెలుసుకుని నిన్న మొన్నటి దాకా ఇంచార్జిగా ఉన్న రేవంత్.. ఇప్పుడు తప్పుకున్నాడు. సీఎంగా ఉండి సీటు ఓడిపోతే పరువు పోతదని గ్రహించి జారుకున్నాడు. చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్ తప్పకుండా గెలుస్తున్నాడు అని కేటీఆర్ పేర్కొన్నారు.

**రంజిత్ రెడ్డి సెంటిమెంట్లకు పడిపోకండి..**

పార్టీ ఎందుకు మారవు అని సోషల్ మీడియాలో రంజిత్ రెడ్డిని పిల్లలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయాల్లో ఓడినంత మాత్రానా పార్టీ నుంచి వెళ్లిపోతామా..? మన పార్టీ అధికారంలోకి వస్తే ఇవాళ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేవాడా..? అవకాశం, స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. అవకాశావాదిని ఓడగొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. రంజిత్ రెడ్డి ఇంటికి వస్తే చాయ్ తాగించి ఓదార్చండి.. కానీ బరాబర్ ఓడగొడుతామని చెప్పండి.. మన పార్టీని ఖతం చేయాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తుంటే.. రేవంత్ రెడ్డి దగ్గర కండువా కప్పించుకున్నాడు. రాజకీయ జీవితం ఇచ్చిన కేసీఆర్‌పై ఆయనకు ప్రేమ లేనప్పుడు.. మనం ఎందుకు ప్రేమ చూపించాలి. రంజిత్ రెడ్డి సెంటిమెంట్లకు పడిపోకండి.. దొంగల పార్టీలో కలిసిపోయావు.. అని చెప్పండి అని కేటీఆర్ సూచించారు.

# రేవంత్ సర్కార్ వేట

హైదరాబాద్ : కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ వేట కొనసాగిస్తోంది. పదేళ్లలో చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికి తీసే ప్రయత్నం చేస్తోంది. ఆరోపణలు ఉన్న ప్రతీ కేసుపై విచారణ జరిపిస్తోంది. ఈ క్రమంలోనే కాళేశ్వరంపై రిటైర్డ్ జడ్జితో విచారణకు నియమించారు. తర్వాత ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దానిపైనా విచారణ కొనసాగుతోంది. మరోవైపు కేసీఆర్ సర్కార్ చేసుకున్న ఒప్పందాలపై సమీక్ష నిర్వహిస్తు న్నారు. విద్యుత్ ఒప్పందాలు, కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో అవినీతి తదితర వాటిపైనా ఆరా తీస్తున్నారు. ఇక కేసీఆర్ కుటుంబ సభ్యులు కేటీఆర్, కవిత, హరీశ్‌రావు, కేసీఆర్ సడ్డకుని కొడుకు, రాజ్యసభ ఎంపీ సంతోష్‌రావు, కేసీఆర్ అన్న కొడుకు కల్వకుంట్ల కన్నారావు అలియాస్ తేజేశ్వర్‌రావు అక్రమాలపైనా బాధితులతో కేసులు పెట్టించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కూడా కేసీఆర్ ఫ్యామిలీని ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ ఫ్యామిటీ టార్గెట్‌గా సీఎం రేవంత్‌రెడ్డి మొదలు పెట్టిన ఆటలో తొలి వికెట్ పడింది. భూ కబ్జా కేసులో మాజీ సీఎం కేసీఆర్ అన్న కొడుకు కల్వకుంట్ల కన్నారావును పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆదిభట్లలో కన్నారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నా రు. మన్నెగూడలో రెండు ఎకరాలను కేసీఆర్ అన్న కొడుకు కన్నారావు కబ్జా చేసేందుకు యత్నించారని పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈమేరకు విచారణ జరిపి కన్నారావుతోపాటు 38 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో ఇప్పటికే 10 మందిని అరెస్టు చేయగా, మరో 28 మంది పరారీలో ఉన్నారు. అరెస్ట్ అయిన వారిలో కన్నారావు ప్రధాన అనుచరుడు డానియల్ కూడా ఉన్నాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కన్నారావు సింగపూర్ పారిపోయి ఉంటాడన్న అనుమానాల వ్యక్తమయ్యాయి. దీంతో పోలీసులు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. తనను కూడా పోలీసులు అరెస్టు చేస్తారని భావించిన కన్నారావు హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశాడు. అయితే తీవ్రమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో బెయిల్ ఇవ్వలేమని న్యాయస్థానం పిటిషన్‌ను తోసిపుచ్చింది. అంతకుముందు కేసు కొట్టివేయాలని కూడా కన్నారావు క్వాష్ పిటిషన్ సైతం వేశాడు. కానీ అవి కూడా ఫలించలేదు. ఇదిలా ఉండగా, 147, 148, 447, 427, 307, 436, 506తీ/లి, 149 ఎఖఅ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పార్లమెంటు ఎన్నికల వేళ.. ఇప్పటికే కవితను ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేసింది. ఆమె తిహార్ జైలులో ఉన్నారు. తర్వాత భూకబ్జా కేసులో సంతోష్‌రావుపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం కేటీఆర్‌పై సైతం క్రిమినల్ కేసు నమోదు చేశారు. తాజాగా కన్నారావును అరెస్టు చేశారు. దీంతో ఇక మిలిగింది కేసీఆర్, హరీశ్‌రావు అన్న చర్చ గులాబీ భవన్‌లో జరుగుతోంది.

# బీఆర్ఎస్ మరింత బలహీనమవుతుందా?

**ఈ ఐదేళ్లు కష్టపడితేనే మరొకసారి అధికారంలోకి వచ్చే అవకాశం**

**తెలంగాణ ఎన్నికల ఫలితాల చరిత్రను తిరగరాసే వీలుంది.**

**రాష్ట్ర విభజనకు ముందు... విభజన తర్వాత పలు పార్టీలు పదేళ్ళు పాలించాయి**

**ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే భావనలో ఉంది**

**దాని తిప్పికొట్టాలంటే కేసీఆర్ అలోచన పనితీరు మారాలి అంటున్నారు విశ్లేషకులు**

**టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా మార్చడంతోనే మొన్నటి ఎన్నికల్లో ఓటమి చవి చూశామన్నది ఎక్కువ నేతల అభిప్రాయం**

**ఒకసారి పేరు మార్చి మళ్లీ వెనక్కు పోవడం ఎందుకన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం**

**బీఆర్ఎస్ పేరు మీదనే మరొకసారి గెలిపించి చూపిద్దామని ఆయన తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయ వర్గాల వెల్లడి**

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌లో మార్పును ఆ పార్టీ నేతలు కోరుకుంటున్నారు. గత పదేళ్లు వేరు. రానున్న ఐదేళ్లు వేరు. ఈ ఐదేళ్లు కష్టపడితేనే మరొకసారి అధికారంలోకి వచ్చే అవకాశముంది. తెలంగాణ ఎన్నికల ఫలితాల చరిత్రను తిరగరాసే వీలుంది. 1995 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఒకసారి అధికారంలోకి వచ్చిన పార్టీ రెండోసారి కూడా గెలిచింది. అంటే ప్రజలు పదేళ్ల పాటు ఒక ప్రభుత్వానికి సమయం ఇస్తున్నట్లే కనపడుతుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో పదేళ్లు వెయిట్ చేసే పరిస్థితి లేదంటున్నారు గులాబీ పార్టీ నేతలు. అందుకే వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండా తెలంగాణలో ఎగరాలన్న ఆలోచనను కేసీఆర్ చేయాలంటున్నారు. వరసగా రెండు సార్లు గెలిచి... 1995, 1999లో తెలుగుదేశం పార్టీ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాటు అధికారంలో ఉంది. అలాగే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా అదే కంటిన్యూ అయింది. 2014 నుంచి 2023 వరకూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో కొనసాగింది. ఇలా ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా పదేళ్ల పాటు తాము పవర్ లో ఉంటామని భావిస్తుంది. దానిని తిప్పికొట్టాలంటే అది కేసీఆర్ చేతిలోనే ఉందంటున్నారు. అందుకు రెండు విషయాల్లో కేసీఆర్ సత్వరం చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలతో పాటు క్యాడర్ కూడా కోరుతున్నారు. ఒకటి పార్టీ పేరు మార్పు దెబ్బతీసిందన్న ఆందోళన అందరి నేతల్లో వ్యక్తమవుతుంది. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా మార్చడంతోనే మొన్నటి ఎన్నికల్లో ఓటమి చవి చూశామన్నది ఎక్కువ నేతల అభిప్రాయం. తమ మనసులో మాటను పార్లమెంటు నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లోనూ కొందరు నేరుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎదుట లేవనెత్తారు. అయితే అందుకు కేసీఆర్ అంగీకరించాల్సి ఉంది. ఒకసారి పేరు మార్చి మళ్లీ వెనక్కు పోవడం ఎందుకన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పేరు మీదనే మరొకసారి గెలిపించి చూపిద్దామని ఆయన తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కానీ ఎక్కువ మంది నేతలు మాత్రం మళ్లీ టీఆర్ఎస్ గా మార్పు చేయాలన్న సౌండ్ మాత్రం ఎక్కువగానే వినిపిస్తుంది. జిల్లాల పర్యటనలు చేపడితేనే నేతల వలసలు ఆగుతాయని చెబుతున్నారు. మొన్నటి నల్లగొండ జిల్లా తరహాలోనే ప్రతి జిల్లాలో ఏదో ఒక సమస్యను తీసుకుని పర్యటిస్తే అక్కడి నేతలు మళ్లీ యాక్టివ్ అవుతారని, క్యాడర్ లో కూడా జోష్ పెరుగుతుందని సీనియర్ నేతలు చెబుతున్నారు. గతంలో మాదిరి ఇప్పుడు ప్రజలు లేరని, కేసీఆర్ క్షేత్రస్థాయిలో వచ్చి పోరాటం చేయాలని క్యాడర్ కోరుకుంటుంది. అప్పుడే పార్టీ బలోపేతమవుతుందని, కేవలం ఎన్నికల సమయంలో వస్తే ప్రజలు నమ్మే అవకాశం లేదని అంటున్నారు. అలాగే గ్రామస్థాయి నుంచి నియోజకవర్గాల స్థాయిలో కూడా నాయకత్వం మారిస్తే మేలన్న సూచనలు కూడా గులాబీ బాస్ కు అందినట్లు చెబుతున్నారు. మరి కేసీఆర్ రెడీ అవుతారా? జనంలో తిరిగేందుకు సిద్ధపడతారా? అన్న దానిపైనే ఆ పార్టీ భవిష?యత్ ఆధారపడి ఉందంటున్నారు.

## సంగారెడ్డి ఫ్యాక్టరీలో పేలిన రియాక్టర్.. ఆరుగురు కార్మికుల దుర్మరణం



**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం.. చందాపూర్ గ్రామంలో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎస్‌బీ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ శబ్దంతో రియాక్టర్లు పేలాయి. పేలుడు ధాటికి కంపెనీలో ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరో 10 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాక సిబ్బంది ఫైరింజన్లతో మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. దుర్ఘటన జరిగిన సమయంలో కంపెనీలో 50 మంది కార్మికులు పని చేస్తున్నారు. మంటల్లో చిక్కుకున్న బాధితులు కాపాడాలంటూ ఆర్తనాదాలు చేస్తున్నారు. అయితే ఒక రియాక్టర్ నుంచి మరో రియాక్టర్‌కు మంటలు వ్యాపించాయి. దీంతో ఇంకో రియాక్టర్ పేలితే ప్రమాదం మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు పరిశ్రమ పరిసరాల నుంచి ప్రజల్ని ఖాళీ చేయిస్తున్నారు. గాయపడిన క్షతగాత్రుల్ని సిబ్బంది అత్యవసర చికిత్స కోసం సంగారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. రాధాకిషన్‌రావుకు ఏడు రోజుల కస్టడీ



**హైదరాబాద్:** ఫోన్ టాపింగ్ కేసులో మాజీ డీసీపీ రాధా కిషన్ రావును తమ కస్టడీకి కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్‌పై బుధవారం నాంపల్లి కోర్టు విచారణ జరిపింది. ఈమేరకు రాధాకిషన్‌రావును పదిరోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టుకు తెలిపారు. అయితే రాధా కిషన్‌రావును ఏడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పోలీసులు ప్రశ్నించనున్నారు. దీంతో గురువారం చంచలగూడ జైలు నుంచి పోలీసులు కస్టడీలోకి తీసుకోనున్నారు. కాగా ట్యాపింగ్ కేసులో రాధాకిషన్ రావు %ూ%4గా ఉన్నారు.

## కాంగ్రెస్‌కు సైబర్ ఝలక్

-మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ కార్యాలయం గాంధీభవన్‌కు కాల్ చేశారు. ఏఐసీసీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని.. పార్టీ అభ్యర్థుల వివరాలు వెంటనే ఇవ్వాలంటూ గాంధీ భవన్ సిబ్బందిని అడిగారు. ఎన్నికల టైమ్ కదా.. నిజంగానే ఏఐసీసీ కార్యాలయం నుంచి అడుగుతున్నారేమోనని, వెనుక, ముందు ఆలోచించకుండా వెంటనే పార్లమెంట్ అభ్యర్థుల వివరాలు అగంతుకులకు పంపించారు. డేటా పొందిన తరువాత.. అందులో ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి మీ బీ ఫాం సిద్ధంగా ఉంది.. రూ.99వేలు ఫోన్ పే చేయాలని అడిగారు. అవాక్కైన అభ్యర్థులు గాంధీ భవన్‌కు సమాచారం అందిచడంతో అసలు విషయం బయటపడింది. మొత్తానికి ఎవరూ డబ్బులు చెల్లించలేదు. దీంతో సైబర్ నేరగాళ్ల ప్లాన్ బెడిసి కొట్టింది.

**ఎన్నికల వేళ**

ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. కొందరు పార్టీ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామని, మరికొందరు ఎన్నికల ప్రచారం కోసం సామాగ్రి పంపిస్తాం.. అడ్వాన్స్ చెల్లించాలంటూ ఫోన్లు చేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో అందరూ బయటకు వస్తారు


-మొదటి పేజి తరువాయి



రైతులను అడిగితే తెలుస్తుందని.. తాము ఏం చేస్తామో సంవత్సరంలో చేసి చూపిస్తామన్నారు. రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. పూర్తి స్థాయి బడ్జెట్‌లో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి రైతును మోసం చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో నాటి సీఎం, వ్యవసాయ మంత్రికి రైతుల కోసం ఎన్ని విజ్ఞాపనలు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వర్షాలుపడలేదని.. కాంగ్రెస్ పాలనలో కరువు వచ్చిందని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం బీఆర్ఎస్ హడావిడి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలు చేశారు.

## బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయింది

-మొదటి పేజి తరువాయి



చేయాలన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇంఛార్జ్‌లు ఎప్పటికప్పుడు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రజలను చైతన్యవంతం చేస్తూ కాంగ్రెస్‌కు ఓటేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పాటు మెదక్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జ్‌లు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# భారత్ అగ్ర దేశంగా రాణిస్తుందా?

ఈ మధ్య భారతదేశం బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని, రాబోయే 2030 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకొని ప్రపంచంలోనే 3వ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. ఈ శుభవార్త భారతీయులందరూ గర్వించతగినదే. అయితే కాస్త నిదానించి చూస్తే అందుకు తగిన పరిస్థితులు మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఉన్నాయా? అని పరిశీలన చేయాలి. ఎందుకంటే, నిజానికి క్షేత్రస్థాయిలో భిన్నమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత భారత్‌లో 28 కోట్ల ప్రజలు అర్ధాకలితోనూ, 21 కోట్ల మంది అనారోగ్యంతోనూ, కోట్లాది మంది నిరుద్యోగంతోనూ, పోషకాహార లోపంతోనూ సతమతం అవుతున్నారని ఆర్థిక నివేదికలు తెలుపుతున్నాయి. గణాంకాలను చూస్తే దేశంలో 18.7 శాతం జనాభా పోషక ఆహార లోపంతో జీవిస్తున్నారు. అందులోనూ 15 నుంచి 24 ఏండ్ల మధ్య వయసున్న యువత 58.1 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దీనితో పాటు కుల, మత, ప్రాంతీయ అసమానతలతో పాటు లింగ వివక్షతో కొన్ని కోట్ల మంది దుర్భర జీవితాలను కొనసాగిస్తున్నారు. మహిళలపై అణచివేతలు, వేధింపులు, లైంగిక హత్యాచారాలు, మహిళల అక్రమ రవాణా, డ్రగ్స్ వినియోగం, సరఫరా మొదలైన సామాజిక దుర్లక్షణాలు కూడా చారిత్రకంగా పెరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మనది వికసిత్ భారత్‌గా చెప్పుకుందామా? పేదరికం దశాబ్దాలుగా మన దేశాన్ని వెంటాడుతూనే ఉంది. కానీ ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మన దేశంలో కుబేరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దేశ సంపద అంతా కేవలం 1 శాతం కుబేరుల చేతిలో బందీగా ఉంది. మరోవైపు సామాజిక, ఆర్థిక అసమానతల వల్ల పేదరికం నానాటికీ మరింత విస్తరిస్తూనే ఉంది. 2020-22 మధ్యకాలంలో 38 లక్షల మంది ఉపాధి కోసం విదేశాల బాట పట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయ వనరుల మొత్తాన్ని ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేయకుండా ఉచిత పథకాల పేర వృథా ఖర్చు చేస్తూ, తిరిగి ఎన్నికల ద్వారా అధికారంలోకి రావడానికి ఉవిళ్ళూరుతున్నాయి. అంతేతప్ప యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించే కృషి చేయకపోవడం దురదృష్టకరం. ఇప్పటికే మన దేశ పౌరులు 3.7 కోట్ల మంది వివిధ దేశాలకు వలస వెళ్లి విదేశీయులుగా మారిపోయారు. 1970-90 మధ్యకాలంలో మేధోవలసలు ఎక్కువగా జరగగా నేడు దీనికి తోడు వ్యాపార వలసలు కూడా జోరందుకున్నాయి. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడమే దీనికి కారణం. తరచుగా మతపరమైన ఉద్రిక్తతలు, సామాజిక సమస్యలు, రాజకీయ విధానాల కారణంగా పారిశ్రామిక వేత్తలు మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారు. అందుకే వారు వెనుకంజ వేస్తున్నారు. ఇక్కడ వారు పరిశ్రమలు స్థాపించకుండా విదేశాల బాటపడుతున్నారు. 2022లో మన దేశ కోటీశ్వరులు 7000 మంది విదేశీ పౌరసత్వం తీసుకోవటమే దీనికి నిదర్శనం. 2013-2022 మధ్యకాలంలో 48,500 మంది కోటీశ్వరులు విదేశీ పౌరులుగా మారిపోయారు. ఇది మన దేశానికి ఎంత లోటు? చదువుల్లో నాణ్యత లేకపోవడం, నైపుణ్యాలు లేమితో సతమతం అవుతున్న యువతలో ఎక్కువమంది గల్ఫ్ దేశాల్లో అసంఘటిత రంగ కార్మికులుగా విదేశాల్లో పనిచేస్తున్నారు. వారికి ఎలాంటి రక్షణ లేదు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉన్న 5 నుంచి 10శాతం మంది మాత్రమే సాఫ్ట్‌వేర్ తదితర ఇంజనీరింగ్ రంగంలో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళుతున్నారు. మిగిలిన 90 శాతం మంది దినసరి వేతనంతో పనిచేస్తున్నారు. వీరిలో మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. వీరందరికీ దేశంలో సరైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు చూపించటంలో మన ప్రభుత్వాలు వైఫల్యం చెందటంతో మెరుగైన జీవనం కోసం వారంతా విదేశాల్లో స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు. నూతనంగా ఏటా 10 కోట్ల మంది యువత ఉపాధి మార్కెట్లోకి వస్తున్నారు. వారికి సరిపడా అవకాశాలు దొరకడం లేదు. ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న భారత్ నిరాశ నిస్పృహలకు నిలయంగా మారుతున్నది. ఏదో సాధించాం, అని మన పాలకులు జబ్బలు చరుచుకోవడం సరికాదు. భవిష్యత్తు పరిణామాలు ఇకనైనా అంచనా వేసి మన యువతీ యువకులకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే పారిశ్రామిక, వర్తక, వాణిజ్య విధానాలను అనుసరించాలి. అంకెల సూచీలలో గ్రేడుల అభివృద్ధిని చూసి ఉబలాట పడకుండా, మన కళ్ళముందు కనిపిస్తున్న వాస్తవ పరిస్థితిని చూసి, అభివృద్ధి అంచనాలు వేయాలి. సరైన ప్రణాళికతో ఉత్పత్తి రంగాల బలోపేతానికి కృషి చేయాలి. దేశంలో భావితరాలకు విదేశాలతో పోటీపడగల నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి. ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రారంభించాలి. విద్యా, వైద్య రంగాలపై వెచ్చించే ప్రతి రూపాయి ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా భావించాలి. అప్పుడే నిజమైన దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

# అగ్రరాజ్య కల సాకారమయ్యేనా!




ఈ మధ్య భారతదేశం బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని, రాబోయే 2030 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకొని ప్రపంచంలోనే 3వ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. ఈ శుభవార్త భారతీయులందరూ గర్వించతగినదే. అయితే కాస్త నిదానించి చూస్తే అందుకు తగిన పరిస్థితులు మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఉన్నాయా? అని పరిశీలన చేయాలి. ఎందుకంటే, నిజానికి క్షేత్రస్థాయిలో భిన్నమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత భారత్‌లో 28 కోట్ల ప్రజలు అర్ధాకలితోనూ, 21 కోట్ల మంది అనారోగ్యంతోనూ, కోట్లాది మంది నిరుద్యోగంతోనూ, పోషకాహార లోపంతోనూ సతమతం అవుతున్నారని ఆర్థిక నివేదికలు తెలుపుతున్నాయి. గణాంకాలను చూస్తే దేశంలో 18.7 శాతం జనాభా పోషక ఆహార లోపంతో జీవిస్తున్నారు. అందులోనూ 15 నుంచి 24 ఏండ్ల మధ్య వయసున్న యువత 58.1 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దీనితో పాటు కుల, మత, ప్రాంతీయ అసమానతలతో పాటు లింగ వివక్షతో కొన్ని కోట్ల మంది దుర్భర జీవితాలను కొనసాగిస్తున్నారు. మహిళలపై అణచివేతలు, వేధింపులు, లైంగిక హత్యాచారాలు, మహిళల అక్రమ రవాణా, డ్రగ్స్ వినియోగం, సరఫరా మొదలైన సామాజిక దుర్లక్షణాలు కూడా చారిత్రకంగా పెరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మనది వికసిత్ భారత్‌గా చెప్పుకుందామా? పేదరికం దశాబ్దాలుగా మన దేశాన్ని వెంటాడుతూనే ఉంది. కానీ ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మన దేశంలో కుబేరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దేశ సంపద అంతా కేవలం 1 శాతం కుబేరుల చేతిలో బందీగా ఉంది. మరోవైపు సామాజిక, ఆర్థిక అసమానతల వల్ల పేదరికం నానాటికీ మరింత విస్తరిస్తూనే ఉంది. 2020-22 మధ్యకాలంలో 38 లక్షల మంది ఉపాధి కోసం విదేశాల బాట పట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయ వనరుల మొత్తాన్ని ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేయకుండా ఉచిత పథకాల పేర వృథా ఖర్చు చేస్తూ, తిరిగి ఎన్నికల ద్వారా అధికారంలోకి రావడానికి ఉవిళ్ళూరుతున్నాయి. అంతేతప్ప యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించే కృషి చేయకపోవడం దురదృష్టకరం. ఇప్పటికే మన దేశ పౌరులు 3.7 కోట్ల మంది వివిధ దేశాలకు వలస వెళ్లి విదేశీయులుగా మారిపోయారు. 1970-90 మధ్యకాలంలో మేధోవలసలు ఎక్కువగా జరగగా నేడు దీనికి తోడు వ్యాపార వలసలు కూడా జోరందుకున్నాయి. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడమే దీనికి కారణం. తరచుగా మతపరమైన ఉద్రిక్తతలు, సామాజిక సమస్యలు, రాజకీయ విధానాల కారణంగా పారిశ్రామిక వేత్తలు మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారు. అందుకే వారు వెనుకంజ వేస్తున్నారు. ఇక్కడ వారు పరిశ్రమలు స్థాపించకుండా విదేశాల బాటపడుతున్నారు. 2022లో మన దేశ కోటీశ్వరులు 7000 మంది విదేశీ పౌరసత్వం తీసుకోవటమే దీనికి నిదర్శనం. 2013-2022 మధ్యకాలంలో 48,500 మంది కోటీశ్వరులు విదేశీ పౌరులుగా మారిపోయారు. ఇది మన దేశానికి ఎంత లోటు? చదువుల్లో నాణ్యత లేకపోవడం, నైపుణ్యాలు లేమితో సతమతం అవుతున్న యువతలో ఎక్కువమంది గల్ఫ్ దేశాల్లో అసంఘటిత రంగ కార్మికులుగా విదేశాల్లో పనిచేస్తున్నారు. వారికి ఎలాంటి రక్షణ లేదు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉన్న 5 నుంచి 10శాతం మంది మాత్రమే సాఫ్ట్‌వేర్ తదితర ఇంజనీరింగ్ రంగంలో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళుతున్నారు. మిగిలిన 90 శాతం మంది దినసరి వేతనంతో పనిచేస్తున్నారు. వీరిలో మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. వీరందరికీ దేశంలో సరైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు చూపించటంలో మన ప్రభుత్వాలు వైఫల్యం చెందటంతో మెరుగైన జీవనం కోసం వారంతా విదేశాల్లో స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు. నూతనంగా ఏటా 10 కోట్ల మంది యువత ఉపాధి మార్కెట్లోకి వస్తున్నారు. వారికి సరిపడా అవకాశాలు దొరకడం లేదు. ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న భారత్ నిరాశ నిస్పృహలకు నిలయంగా మారుతున్నది. ఏదో సాధించాం, అని మన పాలకులు జబ్బలు చరుచుకోవడం సరికాదు. భవిష్యత్తు పరిణామాలు ఇకనైనా అంచనా వేసి మన యువతీ యువకులకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే పారిశ్రామిక, వర్తక, వాణిజ్య విధానాలను అనుసరించాలి. అంకెల సూచీలలో గ్రేడుల అభివృద్ధిని చూసి ఉబలాట పడకుండా, మన కళ్ళముందు కనిపిస్తున్న వాస్తవ పరిస్థితిని చూసి, అభివృద్ధి అంచనాలు వేయాలి. సరైన ప్రణాళికతో ఉత్పత్తి రంగాల బలోపేతానికి కృషి చేయాలి. దేశంలో భావితరాలకు విదేశాలతో పోటీపడగల నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి. ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రారంభించాలి. విద్యా, వైద్య రంగాలపై వెచ్చించే ప్రతి రూపాయి ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా భావించాలి. అప్పుడే నిజమైన దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

# హ్యాండ్ వాష్‌తోనే ఆరోగ్యం..

తినే ముందు చేతులు కడుక్కోమని చెప్తే చాలా మంది, తిన్నాక ఎలాగు కడుక్కుంటాం కదా అంటారు. మరికొంత మంది అయితే, 'నిత్యావసర కార్యక్రమాలు నిర్వహించి కూడా చేతులు కడుక్కోకుండా అలాగే వస్తారు 'అవసరమేముంది అంటారు. వారి చేతుల్తో మీకు షేక్ హాండ్ ఇచ్చి, ఆ తర్వాత మీరు అదే చేతుల్తో భోజనం చేస్తే ఒక్కసారి మీ పరిస్థితి ఊహించుకోండి. ఆహారాన్ని సురక్షితంగా ఉంచడంలో, వ్యాధులను నివారించడంలో మరియు పిల్లలు బలంగా ఎదగడానికి హ్యాండ్ వాషింగ్ ఒక ముఖ్యమైన భాగం. అరచేతులు శుభ్రంగానే కనిపించినా వాటి మీద కోటాను కోట్ల సూక్ష్మజీవులు ఉన్నాయని ఊహించ గలరా? నీళ్లతో చేతులు కడుక్కున్నా అవి పోవు. సబ్బుతో కానీ, హ్యాండ్‌వాష్ ద్రావకంతో కానీ దాదాపు 20 సెకన్లు కడుక్కుంటేనే చేతులు శుభ్రంగా ఉన్నట్టు. ప్రతి రోజూ భోజనం చేయడానికి ముందు, మల విసర్జనకు వెళ్లొచ్చిన తర్వాత ఇలా చేతుల్ని శుభ్రపరుచు కోవడం మనల్ని ఎన్నో అనారోగ్యాల బారి నుంచి రక్షిస్తుంది. చేతులు కడుక్కోకుండా ఉండడం వల్ల ఎన్ని రోగాలు దాడి చేసే అవకాశం ఉందో తెలుసా? రెండు వందలకు పైనే! ఆ రోగాల్ని కలిగించే సూక్ష్మజీవులు ఉండేది అరచేతుల్లోనే. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 35 లక్షల మంది చిన్నారులు డయేరియా, నిమోనియా లాంటి రోగాల వల్ల మరణిస్తున్నారు. ఓ అంతర్జాతీయ సర్వే ప్రకారం మన దేశంలో కేవలం 44 శాతం మంది మాత్రమే చేతుల శుభ్రత పాటిస్తున్నారని తేలింది. ఈ రోజు దేశదేశాల్లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆస్ట్రేలియాలో చేతుల శుభ్రతపై రాసిన పాటని పిల్లలందరూ ఆలపిస్తారు. తజికిస్తాన్‌లో పిల్లలు బొమ్మలు, పోస్టర్లతో ప్రచారం చేస్తారు. మడగాస్కర్‌లో సుమారు 35 లక్షల మంది బాలలు కలిసి ఒకేసారి సబ్బుతో చేతులు కడుక్కుంటారు. ఈ కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు కూడా పాల్గొంటారు. దక్షిణాఫ్రికాలో సుమారు 90 లక్షల మంది ఎసెమ్మెస్‌లను బట్వాడా చేస్తారు. మన దేశం తరుఫున క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్‌లు వేలాది



మంది పిల్లల మధ్య సబ్బుతో చేతులు కడుక్కుని ప్రచారం చేశారు. సబ్బుతో చేతితో కడగడం వల్ల అతిసారం మరియు తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నివారించడానికి తక్కువ ఖర్చుతో కూడుకున్న మార్గం. న్యుమోనియా ఒక ప్రధాన మృత్యు ఒడి (తీవ్రమైన శ్వాసకోశ సంక్రమణ), ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో మరణాలకు మొదటి కారణం. సంవత్సరానికి 1.8 మిలియన్ల మంది పిల్లలు మరణిస్తున్నారు. విరేచనాలు మరియు న్యుమోనియా కలిసి సంవత్సరానికి దాదాపు 3.5 మిలియన్ల పిల్లల మరణాలకు కారణమవు తున్నాయి. సబ్బుతో చేతితో కడుక్కోవడం వల్ల అతిసారం కేసులు 30% మరియు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 21% తగ్గుతాయని అంచనా. కోవిడ్ మహమ్మారి సూక్ష్మ క్రిముల వ్యాప్తిని ఆపడానికి మరియు ఆరోగ్యంగా ఉండటానికి అత్యంత ప్రభావ వంతమైన మార్గాలలో ఒకటి కూడా సబ్బు, నీటితో చేతులు కడుక్కోవడం. చేతులు శుభ్రంగా ఉంచడం వల్ల డయేరియా అనారోగ్యాలలోమరియు జలుబు లేదా ఫ్లూ వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నివారించ వచ్చు. అనారోగ్యం బారిన పడకుండా మరియు ఇతరులకు సూక్ష్మ క్రిములను వ్యాప్తి చేయకుండా ఉండటానికి మనం తీసుకోగల ఉత్తమ చర్యలలో సబ్బు మరియు నీటితో చేతులు కడుక్కోవడం.పరిశుభ్రమైన నీరు మరియు సబ్బు వాడకం మంచి అలవాటు. సబ్బు మరియు శుభ్రమైన నీటితో చేతులు కడుక్కోనప్పుడు ప్రజలను అనారోగ్యానికి గురిచేసే అనేక సూక్ష్మక్రిములు వ్యాప్తి చెందుతాయి. అందుకే హ్యాండ్ వాషింగ్ చాలా ముఖ్యమైనది. ముఖ్యంగా బాత్రూమ్ ఉపయోగించిన తర్వాత, ఆహారాన్ని తయారు చేసేటప్పుడు, తినడానికి ముందు, మరియు దగ్గు, తుమ్ము లేదా మీ ముక్కును చీదడం వంటి ముఖ్య సమయాల్లో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని మరియు వాటిని క్రమం తప్పకుండా కడగాలని, తినడానికి ముందు మరియు తరువాత, వాష్ రూమ్ ఉపయోగించిన తర్వాత లేదా ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు చేతి పరిశుభ్రత పాటించాలి అనేది కొత్త భావన కానప్పటికీ... ప్రస్తుత ఆరోగ్య సంక్షోభం కారణంగా ఇది మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి సబ్బు మరియు నీటితో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం ద్వారా అనేక ఇతర సంక్రమణ వ్యాధులు సోకకుండా నివారించాలి. కమ్యూనిటీలలో హ్యాండ్ వాషింగ్ సబ్బు మరియు నీటితో చేతులు కడుక్కోవడం సరళమైనది మరియు చవకైనది మాత్రమే కాదు, అనారోగ్యానికి గురయ్యే చిన్న పిల్లల సంఖ్యను కూడా గణనీయంగా తగ్గిస్తుంది . హ్యాండ్ వాషింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటానికి సహాయ పడుతుంది. సమాజంలో అందరూ ప్రస్తుతం మరియు భవిష్యత్తు కోసం సార్వత్రిక చేతి పరిశుభ్రతను సాధించాలి. చేతి పరిశుభ్రతకు ప్రపంచ ప్రాధాన్యత నివ్వాలి. ఆరోగ్య సంరక్షణ కార్మికులతో (పారిశుధ్య కార్మికులతో) శుభ్రమైన సంరక్షణ మరియు అంటువ్యాధుల నివారణలో పాల్గొనాలి. అన్ని సమాజాలలో సబ్బుతో చేతితో కడగడం యొక్క సాధారణ సంస్కృతిని ప్రోత్స హించాలి మరియు మద్దతు ఇవ్వాలి.

## వెంటాడే అదృశ్య మారణాయుధాలు

దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యం, చొరబాటు దారులు, ఉగ్రవాదుల చొరబాట్లను నిరోధించడానికి రక్షణశాఖ వినియోగించే విచక్షణారహిత, ప్రమాదకర, ప్రాణాంతక ఆయుధాలుగా మందుపాతరలకు పేరుంది. మందుపాతరల విధ్వంసానికి శత్రువులు మాత్రమే కాకుండా సామాన్య అమాయక ప్రజలు, సైనికులు కూడా ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం, జీవనోపాధులను కోల్పోవడం అనాదిగా జరుగుతున్నది. గత రెండు దశాబ్దాలుగా "యూఎన్ మైన్స్ ఆక్షన్ సర్వీసెస్"విభాగం సామాన్య ప్రజలకు, పీస్‌కీపర్స్, హెల్పర్స్, గాయపడిన అభాగ్యులకు అవగాహనతో పాటు సహాయాన్ని అందజేస్తున్నది. మందుపాతరల భయంకర విధ్వంసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గాయపడిన లేదా చనిపోయిన కుటుంబాలకు చేయూతను ఇవ్వడాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 2005లో ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించి ప్రతి ఏట 04 ఏప్రిల్‌న ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ మందుపాతరల అవగాహన దినం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ మైన్ అవేర్‌నెస్"ను పాటించుట ఆనవాయితీగామారింది. ఈ ఏడాది అంతర్జాతీయ మందుపాతరల అవగాహన దినం-2024 నినాదంగా "ప్రొటెక్టింగ్ లైవ్స్, బిల్డింగ్ పీస్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. యుద్ధ సమయాల్లో పాతిన మందుపాతరల వల్ల అక్కడి ప్రజలు కాలు మోపలేక, జీవనోపాధ సాగించలేక నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా దేశ సరిహద్దులు, ప్రచ్ఛన్న యుద్ధ సమయాల్లో ఆయా దేశాల సైనికులు శత్రుమూకలను మట్టుపెట్టడానికి మందుపాతరలు అమర్చడం దశాబ్దాలుగా కొనసాగుతున్నది. అవసరం లేని మందుపాతరలను తొలగించడం, గాయపడిన/ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు చేయూత ఇవ్వడం, సామావదన్య పౌరసమాజానికి మందుపాతరల పట్ల అవగాహన కల్పించడం లాంటి చర్యలు చేపట్టడం జరుగుతున్నది. మందుపాతరల పాతిన ప్రదేశాలు వ్యవసాయానికి, ఆవాసాలు ఏర్పరచుకోవడానికి, జీవనోపాధులు సాగించడానికి వీలు కాదని మనకు తెలుసు. ఆ ప్రదేశాల ప్రజలు/పిల్లలు కాలు కదపడానికి, నేలను వినియోగించుకోవడానికి భయపడుతుంటారు.

ప్రపంచవ్యాప్తంగా 61 దేశాలు మందుపాతరలను వినియోగిస్తూ ఆయా ప్రదేశాల ప్రజల జీవితాలను, జీవనోపాధులను ప్రభావితం చేస్తున్నారు. 2016లో మందుపాతరల పేలిన ఘటనల్లో 8,600 మంది ప్రాణాలు కోల్పోవడం, వేల మంది గాయపడడం నమోదు అయ్యింది. మందుపాతరలు అత్యధికంగా వినియోగించే దేశాల జాబితాలో ఈజిప్ట్, అఫ్ఘానిస్థాన్, సిరియా, అంగోల, కాంబోడియా, ఇరాక్, సోమాలియా, బోస్నియా, ఇథియోపియా, లిబియా, మొదాంబిక్, సూడాన్, ఇజ్రాయిల్, మయాన్మార్, రష్యా, బ్రెజిల్, ఉక్రెయిన్, కొలంబియా, కాంగో, యూకె, సౌత్ ఆఫ్రికా, యూఎస్‌లు ఉన్నాయి.

http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



## స్థానిక వార్తలు

# నామను గెలిపించి, పార్లమెంట్ కు పంపిద్దాం

- కసితో పని చేసి నామను గెలిపించాలి
- నామ ను గెలిపించి కేసీఆర్ కు అండగా నిలుద్దాం



**వాస్తవ నేస్తం,బోనకల్:** జానకీపురంలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సన్నాహక సమావేశంలో నామ నాగేశ్వరరావు, తాతా మధు, వద్దిరాజు రవిచంద్ర, లింగాల కమలరాజ్, కొండబాల కోటేశ్వరరావు మోసపోయామని ఇప్పుడు ప్రజలు గోస పడుతున్నారు అని అన్నారు. ఆలోచనలతో ఏకీభవించి, కసి తో పని చేసి, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బోనకల్ మండలం జానకీపురం గ్రామంలో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో నామ నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రజలు ఓట్లేసి ఇచ్చిన అధికారం వల్లనే రెండు సార్లు పార్లమెంట్ కు పోయి ప్రజల వాణిని, వారి గొంతుకగా వినిపించానని అన్నారు.నేను పార్లమెంట్ లో ఉన్నా ఎప్పుడూ జిల్లా ప్రజల జాసే ఉంటుందని అన్నారు. మళ్లీ మూడోసారి గెలిపించి పార్లమెంట్ కు పంపిస్తే మరింత అభివృద్ధి కి కృషి చేస్తానని అన్నారు. కష్ట కాలం లో నన్ను గెలిపించి, కేసీఆర్ కు అండగా ఉండాలని పేర్కొన్నారు.కేసీఆర్ ఆశీర్వాదం తో పార్లమెంట్ లో ఎన్నో సమస్యలపై గళం విప్పి, కేంద్రంపై పోరాడి, అనేకమైనవి సాదించానని చెప్పారు.కాంగ్రెస్, బీజేపీ నుంచి గెలిచిన తెలంగాణ ఎంపీలు ఏనాడు రాష్ట్రం గురించి మాట్లాడిన సందర్భం లేదన్నారు. తన కృషి వల్లనే జిల్లాలో రాష్ట్ర రహదారులు జాతీయ రహరులుగా మారాయని, భద్రాచలం - కొవ్వూరు రైన్ కోసం 120 కి పైగా కేంద్రానికి లెటర్లు రాశానని, కేంద్ర మంత్రులను, అధికారులను పెద్ద ఎత్తున కలిసిన ఫలితంగా ఇవన్నీ సాధ్యమయ్యాయని అన్నారు. జిల్లా లో జరిగిన ప్రతి అభివృద్ధి లో నామ ముద్ర ఉంటుందని స్పష్టం చేశారు. 10 ఏళ్లలో కేసీఆర్ దిశా నిర్దేశకత్వంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ అభివృద్ధిని సాధించిందని , వరి ఉత్పత్తి లో దేశంలోనే నెంబర్ వన్ ప్రగతి సాధించామని చెప్పారు. మాయ, మోసపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వల్ల ఈ నాలుగు నెలల కాలంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలన వస్తే ఎలా ఉంటాదో గతంలో కేసీఆర్ చెప్పినట్లే కాంగ్రెస్ పాలన జరుగుతుందని, కష్టాలకు విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుతున్నారని అన్నారు.రైతు బిడ్డగా ప్రజల కష్టాలు దగ్గరగా కళ్లారా చూశాను... గత కాంగ్రెస్ పాలనలో కరెంట్, సాగు, తాగునీటి సమస్యలు తో పాటు అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఎప్పుడూ ధర్నాలు చేసే వారమని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు అవే పరిస్థితులు దాపురించాయని అన్నారు.కష్ట కాలంలో పార్టీ అభ్యర్థుల గెలుపు ఎంతో అవసరమని, తనను మంచి మెజార్టీతో గెలిపించి, కేసీఆర్ కు అండగా నిలవాలని నామ నాగేశ్వరరావు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో నామను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించాలని, బోనకల్ మండలం నుంచి మంచి మెజార్టీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. నామ గెలిస్తేనే తెలంగాణ ప్రజల హక్కులు కోసం, పెండింగ్ నిధులు, ప్రాజెక్టులు , ఇతర సమస్యలు సాదించడానికి,పార్లమెంట్ లో జిల్లా వాణి వినిపించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. నామ గెలిస్తేనే తెలంగాణ బిడ్డల ప్రయోజనాలు నెరవేరుతాయని మధు అన్నారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఉత్తమ పార్లమెంటేరియన్ నామ గెలుపు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరమన్నారు. నామను గెలిపించి కేసీఆర్ కు అండగా ఉండాలన్నారు. ఏదో జరుగుతుందని ప్రజలు ఆశించి, కాంగ్రెస్ ను గెలిపించారని, అదే ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు కర్రు కాల్చి, వాత పెట్టబోతున్నారని అన్నారు. నామ గెలుపు ఒక మైలు రాయిగా నిలిచి పోతుందని అన్నారు.జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ మాట్లాడుతూ కష్టకాలంలో నామను మంచి మెజార్టీతో గెలిపించుకుని, కేసీఆర్ కు అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అందరూ సమైఖ్య%శీ%గా కలసి పని చేసి, నామ కు మెజార్టీ తీసుకురావాలన్నారు.


## మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ఒక వేదిక



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలో గల జానకిపురం గ్రామపంచాయతీ నందు గల ముజఫర్ నగర్ నందు పూర్తి స్థాయిలో విజయవంతం అయిన హిందూ - ముస్లిం మహిళ సోదరీ మణుల ఇఫ్తార్ పార్టీ మత సామరస్యానికి నాంది పలికిన ఇఫ్తార్ పార్టీ, ఒకే వేదిక మీద హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదరీ మణులు, ముస్లిం సమాజానికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, సంతోషం వ్యక్తం చేసిన హిందూ, క్రిస్టియన్ సోదరీ మణులు పాల్గొన్నారు.

## కాటా ఇంటికి మంత్రి కొండా సురేఖ

**నీలం గెలుపుకు కృషి చేయాలని సూచన**
**పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తానని వెల్లడించిన కాటా**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ నివాసానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ కొండా సురేఖ, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ తో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గారితో సమావేశమై వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నీలం మధు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. పటాన్చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.

## ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలం రాజురా గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో పోరాట వీరుడు,తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విగ్రహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుమ కులస్తులు మాట్లాడుతూ... దొడ్డి కొమరయ్య ఆశ సాధన కోసం కృషి చేయాలని వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వడం దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి వేడుకలు అధికారికంగా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కురుమ సంఘ సభ్యులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కనకాపూర్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలంలోని కనకాపూర్ గ్రామంలో 344 ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ... ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 3 న, మరాఠా యోధుడు రాజు యుద్ధభూమిలో శౌర్యసాహసాలకు గుర్తుగా జరుపుకుంటారు అని అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ నైపుణ్యం కలిగిన నాయకుడు మరియు వీర యోధుడు. అతను గెరిల్లా యుద్ధంలో నిపుణుడు మరియు రహస్య సైనిక కార్యకలాపాలను ప్లాన్ చేశాడు అని, అతని రహస్య యుద్ధం కారణంగా అతన్ని తరచుగా "పర్వత ఎలుక" అని పిలుస్తారు అని అన్నారు. శివాజీ మహారాజ్‌కి రామాయణం మరియు ఆసక్తిగల పాఠకుడు, అది నువ్వు ఎటువంటి అధికారిక పాఠశాల విద్యకు హాజరు కాలేదు అని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కష్టపడండి.. కలిసికట్టుగా ముందుకు సాగండి

**మెదక్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జి లు శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్ లో ముఖ్యమంత్రి నివాసంలో మెదక్ పార్లమెంట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తో పాటు మెదక్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గల ఇంచార్జిలు కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహానేత ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ స్థానం మనకు ప్రతిష్టాత్మకమని ఈ స్థానంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చి గెలిపించాలని సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, బిజెపి పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని ఇదే అదనుగా నాయకత్వమంతా కలిసికట్టుగా పనిచేసి మెదక్ సీటును కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అమలుతో ప్రజలలో పార్టీ పట్ల సానుభూతి పెరిగిందని ప్రచారంలో మన పథకాలే ప్రచారస్త్రాలుగా వినియోగించుకొని విజయం సాధించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్చార్జిలు ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, పఠాన్ చెరు ,నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జిలు కాటా శ్రీనివాస్ గౌడ్,రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి ,పూజాల హరికృష్ణ, నాయకులు ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి



**వాస్తవ నేస్తం,కోదాడ:** జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చెయ్యాలని బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆహార మరియు పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖామాత్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ని టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు కోలా నాగేశ్వరరావు టిడబ్ల్యూజే (ఐజేయు) ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు గింజల అప్పిరెడ్డి, దాడుల నిరోధక కమిటీ జిల్లా అధ్యక్షుడు బాదే రాము ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అలుగూరి హరినాథ్, లంకెల దశరథ రెడ్డి, దాచేపల్లి సతీష, నరేందర్, ఆవుల మల్లికార్జున్ మేకపోతుల వెంకటేశ్వర్లు, జూలూరు వీరభద్రం, కోట రాంబాబు, పగడాల వాసు, చలిగంటి దామోదర్, లావుడియా రమేష్, చారు గుండ్ల అజయ్, షేక్ షంషుద్దీన్, పల్లపు శ్రీనివాస్, గంధం రాము, చలిగంటి నాగరాజు, వెలిశాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- కోదాడలో కేంద్ర బలగాల కవాతు
- కోదాడ పట్టణ సిఐ రాము





**వాస్తవ నేస్తం,కోదాడ:** పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని కోదాడ పట్టణ సీఐ. రాము తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుండి రంగా థియేటర్,సూర్యాపేట రోడ్డు వరకు కేంద్ర పోలీసు బలగాలు సిఐఎస్ఎఫ్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో కవాతు నిర్వహించారు.అనంతరం రంగా థియేటర్ ఆవరణలో ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు...ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రంజిత్ రెడ్డి,ఏఎస్ఐ. వెంకటేశ్వర్లు,హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్ గౌడ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లగోధుమలతో ఆరోగ్యం భేష్!



మన చుట్టూ పెరిగేటువంటి వాటిలో గోధుమలు కూడా ఒకటి..గోధుమపిండితో తినే వంటకాలు ఎక్కువగా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.. మైదా పిండితో పోల్చినప్పుడు గోధుమలు తయారుచేసిన పదార్థాలు తొందరగా జీర్ణం అవుతాయి..అందరికీ గోధుమలు అంటే కచ్చితంగా బ్రౌన్ కలర్ గోధుమలు మాత్రమే తెలుస్తూ ఉంటాయి.. గోధుమలలో నలుపు రంగు గోధుమలు కూడా ఉంటాయి.. సాధారణంగా గోధుమల రేటుతో పోలిస్తే బ్లాక్ గోధుమలు నాలుగు రెట్లు అధికంగా ఉంటుందట. ఈ పంట వల్ల రైతులకు కూడా మంచి లాభం వస్తుందట.. అయితే మరి ఈ బ్లాక్ గోధుమల వల్ల ఆరోగ్య ప్రయోజనాలను ఇప్పుడు చూద్దాం..డయాబెటిస్తో ఇబ్బంది పడేవారు ఈ నల్ల గోధుమలు చాలా అద్భుతంగా పనిచేస్తాయి.. వైట్ రైస్ కు బదులుగా గోధుమ రొట్టెలను తయారు చేసుకొని తినడం వల్ల రక్తంలో ఉండేటువంటి చక్కెర స్థాయిలు తగ్గిపోతాయి.. నల్ల గోధుమలలో ఐరన్ ఎక్కువగా లభిస్తుంది. ఇది రక్తహీనతతో ఇబ్బంది పడేవారికి నల్ల గోధుమలు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. వీటితో తయారు చేసేటువంటివి తరచూ తింటూ ఉండడం వల్ల గుండె సంబంధిత సమస్యలు కూడా దూరమవుతాయి. నల్ల గోధుమలలో ఎక్కువగా ఫైబర్ కంటెంట్ ఉంటుంది. దీనివల్ల త్వరగా జీర్ణం కూడా అవుతుందట. ఒత్తిడి డిప్రెషన్ వంటి సమస్యలకు కూడా నల్లటి గోధుమలు చెక్ పెడతాయి.. అధిక బరువుతో ఇబ్బంది పడుతున్న వారికి ఈ నల్ల గోధుమలు బెస్ట్ ఆప్షన్ ప్రతిరోజు వీటి ద్వారా చేసేటువంటివి తినడం వల్ల త్వరగా బరువు తగ్గుతారు. ఈ నల్ల గోధుమలు వేల సంవత్సరాల క్రితమే సాగు చేశారు ఇందులో ఎక్కువగా ప్రోటీన్స్ ,విటమిన్స్, ఖనిజాలు, ఐరన్ ,పొటాషియం, కాఫర్ వంటివి పుష్కలంగా లభిస్తాయి.. సాధారణ గోధుమలతో పోలిస్తే ఇందులో ఎక్కువగా పోషకాలు కలిగి ఉంటాయట. నల్ల గోధుమలు క్యాన్సర్ ను కూడా నయం చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉంటుంది.. నల్ల గోధుమలతో తయారు చేసేటువంటి వాటిని కనీసం వారంలో రెండు సార్లు తింటే ఎంత ఆరోగ్యంగా ఉండవచ్చట.

# ఈ వ్యాధులను తరిమికొట్టే సీతాఫలం..

సీతాఫలాన్ని ఆంగ్లంలో "కస్టర్డ్ యాపిల్" అంటారు . ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న భారత ఉపఖండంలో ప్రసిద్ధి చెందిన పండు. సీతాఫలం మాత్రమే కాదు, దాని ఆకులు కూడా చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. దీని ఆకులను ముఖ్యంగా ఆయుర్వేదంలో చాలా ఉపయోగకరంగా భావిస్తారు. ఎందుకంటే ఇది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేస్తుంది. మీరు సీతాఫలం ఆకులను జ్యూస్, డికాక్షన్ లేదా టీ రూపంలో తీసుకోవచ్చు. ఇది శరీరానికి అనేక పోషకాలను అందిస్తుంది. మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. సీతాఫలం ఆకులు మన ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయో తెలుసుకుందాం. సీతాఫలం ఆరోగ్య ప్రయోజనాలు: సీతాఫలం ఆకుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం కూడా ఉన్నాయి. ఇందులో చాలా యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. శరీరంలో వాపు, నొప్పి నుండి ఉపశమనాన్ని అందించే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి.డయేరియా సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల అనేక పొట్ట సంబంధిత సమస్యలు నయమవుతాయి. సీతాఫలంలో టానిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది అతిసారాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే ఈ ఆకులో ఉండే పీచు అజీర్ణ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. గ్యాస్ ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకుల్లో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి పెరుగుతుంది.



# ఎండాకాలంలో చర్మం జిడ్డుగా మారుతోందా?



ఎండాకాలం వచ్చేసింది. సూర్యుడి వేడికి ఆరోగ్యంతోపాటు చర్మాన్ని కూడా ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి. వాతావరణానికి అనుగుణంగా చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. చలికాలంలో చర్మం పొడిబారినట్లు అవుతుంది. అదేవిధంగా వేసవిలో మండే ఎండలు, తేమ, వేడి కారణంగా ముఖం జిగటగా మారుతుంది. చెమట, నూనె రెండూ చర్మంపై పేరుకుపోయి జిడ్డుగా కనిపిస్తుంది. దీంతో రోజంతా దుమ్ము, ధూళి ముఖంపై పేరుకుపోతుంది. ఫలితంగా మొటిమలు, బ్లాక్ హెడ్స్ సమస్య ఏర్పడి ముఖం డల్‌గా కనబడుతుంది. ఈ సమస్యను నివారించడానికి అనేక రకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను ఉపయోగిస్తుంటారు. కానీ అవి తాత్కాలికంగా మాత్రమే ఉపశమనం కలిగిస్తాయి. ముఖ్యంగా జిడ్డు చర్మతత్వం కలిగిన వారు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం, తద్వారా మొటిమలు, బ్లాక్ హెడ్స్, డల్ స్కిన్ వంటి సమస్యలను నివారించవచ్చు. అలాగే వేడి కారణంగా చర్మం జిగటగా అనిపించకుండా, నూనె ఎక్కువగా పేరుకుపోకుండా ఉండేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే.. వేసవిలో జిడ్డు చర్మాన్ని సంరక్షించుకునేందుకు ముందుగా ఆహారపు అలవాట్లపై శ్రద్ధ పెట్టాలి. ఆహార అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా సగం సమస్యను నివారించవచ్చని ఢిల్లీలోని ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని డెర్మటాలజీ విభాగానికి చెందిన డాక్టర్ భావుక్ ధీర్ సూచిస్తున్నారు. వేసవి కాలంలో ఆహారపు అలవాట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని ఆయన చెబుతున్నారు. బయటి ఫుడ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలి. వేయించిన, మసాలా వంటి అనారోగ్యకరమైన ఆహారాలు, జంక్ ఫుడ్ తినడం మానేయాలి. వీటికి బదులుగా ఆరోగ్యకరమైన ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తినడం బెటర్. అలాగే తాజా పండ్లు, కూరగాయలు తినాలి. బ్రేక్ ఫాస్ట్‌కు పండ్లు, డిన్నర్‌తో సలాడ్‌గా తాజా కూరగాయలను కూడా తీసుకోవచ్చు.


# మూర్ఛ అనేది ఒక తరం నుంచి మరొక తరానికి వ్యాపిస్తుందా!



గ్రామీణ ప్రాంతాల్లో మూర్ఛ వ్యాధి విషయంలో ఇప్పటికీ అవగాహన కొరవడింది. ఈ సమస్యతో బాధపడుతున్నవారు ఎంత ఇబ్బందిపడుతున్నప్పటికీ నాటువైద్యా న్ని ఆశ్రయిస్తారు కానీ మంచి హాస్పిటల్‌కు తీసుకెళ్లరు. మూర్ఛ అనేది మెదడు సంబంధించిన ఒక వ్యాధి. మెదడు పనితీరులో ఆటంకం కారణంగా ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతు న్నారు. చాలా సందర్భాలలో మూర్ఛ సమస్య జన్యుపరమైన కారణాల వల్ల సంభవిస్తుంది. అంటే ఈ వ్యాధి ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తుంది కానీ చాలా మందికి దీని గురించి తెలియదు. కొన్నిసార్లు మూర్ఛ పేషెంట్లను హాస్పిటల్‌కు తీసుకెళ్లినా ట్రీట్‌మెంట్ చివరివరకు కొనసాగించ రు. చికిత్స మధ్యలోనే వదిలేస్తారు. దీని కారణంగా వ్యాధి మరింత తీవ్రమవుతుంది. కానీ సమయానికి చికిత్స అందిస్తే 80 నుంచి 90 శాతం మూర్ఛ రోగులలో ఈ వ్యాధి కంట్రోల్ అవుతుం ది. ఒక వ్యక్తి ఆకస్మిక మూర్ఛ అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని గుర్తుంచుకోండి. జన్యుపరమైన కారణాల వల్ల మూర్ఛ వస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. దాదాపు 70% మూర్ఛ కేసులు జన్యుపరమైన కారణాలతో సంబంధం కలిగి ఉంటాయి. ఇటీవల ప్రచురించిన పరిశోధన ప్రకారం శరీరంలో ఉన్న 977 జన్యువులు మూర్ఛకు సంబంధించినవి. ఈ జన్యువులను ఫినోటైప్ ఆధారంగా 4 వర్గాలుగా విభజించారు. మూర్ఛ జన్యువులుగా పరిగణించబడే 84 జన్యువులు ఎపిలెప్సీ సిండ్రోమ్‌కు కారణమవుతాయి. తల్లిదండ్రులకు మూర్ఛ సమస్య ఉంటే అది పిల్లలలో కూడా సంభవించే ప్రమాదం ఉంది. ఈ వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

# తిన్న వెంటనే కడుపులో నొప్పిగా ఉందా..?

ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారం, జీవన శైలి కారణంగా అనేక అనారోగ్య సమస్యలు మన చుట్టుముడుతున్నాయి. అందువలన ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు పెద్దవారు.అయితే చాలా మందికి అన్నం తిన్న వెంటనే కడుపులో నొప్పి, తిమ్మిరి లాంటి సమస్యలు వస్తుంటాయి. కానీ ఇది మామూలు అన్నట్లే వదిలేస్తారు. కానీ ఇలాంటి లక్షణాలు కనిపిస్తే అస్సలే నెగ్లెట్ చేయకూడదు అంటున్నారు వైద్యులు. వెంటనే వైద్యుడిని సంప్రదించాలంట. తిన్న తర్వాత కడుపు నొప్పి రావడానికి అల్సర్ ఒక కారణం కావచ్చునంట. దీని వలన తిన్న తర్వాత కడుపులో నొప్పి వస్తుంది. అంతే కాకుండా సరైన టైమ్‌కి ఫుడ్ తినకపోవడం వలన కూడా ఈ నొప్పి వస్తుంది. కడుపు సంబంధిత వ్యాధులలో ఇదొక్కటి. దీని వలన పేగులలో ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ రకమైన నొప్పి వస్తే ఎక్కువగా మసాలా ఫుడ్ తినకుండా ఉండాలంట. అంతే కాకుండా ఫుడ్ పాయిజనింగ్ వల్ల కూడా తిన్న తర్వాత కడుపు నొప్పి, తిమ్మిరి లాంటి సమస్యలు వస్తాయి. దీనికి సరైన సమయంలో చికిత్స అందించకపోతే ఇది చాలా తీవ్రంగా మారే అవకాశం ఉంటుదంట. అలాగే పెద్ద పేగులో ఏవైనా సమస్యలు ఉన్నా, తిన్న తర్వాత కడుపు నొప్పి రావడం జరుగుతుందంట.





# తారక్ అభిమానులకు అదిరిపోయే న్యూస్..

## దేవర ఫస్ట్ సింగిల్ టైం ఫిక్స్?

జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం దేవర కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ రెండు పార్టులుగా రానుండగా.. దేవర పార్టు 1 అక్టోబర్ 10న విడుదలకు రెడీ అవుతోంది. షూటింగ్ దశలో ఉన్న పార్టు 1కు సంబంధించిన ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తూ తారక్ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తోంది. ఫిషింగ్ హార్బర్ విలేజ్, పోర్ట్ మాఫియా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ భామకు తెలుగులో డెబ్యూ ప్రాజెక్ట్. మేకర్స్ దేవర నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన అదిరిపోయే గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. దేవర ఆల్బమ్ కిల్లింగ్‌గా ఉండబోతుందని ఇప్పటికే మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ హింట్ ఇచ్చేశాడు. కాగా దేవర ఫస్ట్ సింగిల్‌ను తారక్ పుట్టినరోజున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారన్న గాసిప్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మరి దీనిపై మేకర్స్ ఏదైనా అధికారిక ప్రకటన జారీ చేస్తారేమో చూడాలి. ఇప్పటికేఅనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన దేవర ఒరిజినల్ సౌండ్ ట్రాక్ %ూశ్రీశ్రీఝఅశ్రీప్త్రమఅస్త్రవతీ%ను విడుదల చేయగా.. అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో గూస్ బంప్స్ తెప్పిస్తోంది. దేవర పార్టు 1 డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం భారీ మొత్తానికి నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్నట్టు ఇప్పటికే అప్‌డేట్స్ వచ్చాయి.ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. ప్రకాశ్ రాజ్, షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ఇతర కీ రోల్స్ పోషిస్తున్నారు. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.



# నేను ఎంజాయ్ చేయలేకపోయా

దాదాపు మూడు దశాబ్దాల కిందట జగపతిబాబు అంటే మ్యాన్లీ హీరో అని పేరు ఉంది. ఆయనకంటూ ప్రత్యేకమైన అభిమానులు ఉండేవారు. ఇక ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునే విధంగా జగపతిబాబు హీరోగా సినిమాలను చేస్తూ ఎన్నో సూపర్హిట్లను కూడా అందుకున్నాడు. కానీ ఇండస్ట్రీలో ఉండే పోటీని మాత్రం తట్టుకోలేక వెనుకబడిపోయాడు జగపతిబాబు. దీంతో మొదట్లో సూపర్ హిట్ లు అందుకున్న తర్వాత కాలంలో మాత్రం అవకాశాలు తగ్గాయి. ఇక కొన్నాళ్లపాటు సినిమా ఇండస్ట్రీలో కనుమరుగయ్యాడు. ఇక జగపతిబాబు కెరియర్ ముగిసిపోయింది అనుకుంటున్నా సమయంలో... సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. మ్యాన్లీ హీరోగా ఫ్యామిలీ స్టార్ గా పేరు సంపాదించుకున్న జగపతిబాబు.. ఏకంగా బాలయ్య లాంటి పవర్ఫుల్ హీరో సినిమాలో విలన్ పాత్రలో కనిపించడానికి సిద్ధమయ్యాడు. జగపతిబాబు ఏంటి బాలయ్య సినిమాలో విలన్ ఏంటి.. బాలయ్య లాంటి పవర్ఫుల్ హీరోని ఢీకొట్టే విలన్ పాత్రకు అసలు జగపతిబాబు సరిపోతాడా అని అందరూ అనుకున్నారు. కానీ సినిమా చూసిన తర్వాత అందరి నిర్ణయం మారిపోయింది. ఆ పాత్రకు జగపతిబాబు తప్ప మరొకరు సెట్ కారు అనే రేంజ్ లో యాక్టింగ్ చేశాడు. ఆ తర్వాత వరుసగా అవకాశాలు అందుకున్నాడు. విలన్ గానే మాత్రమే కాకుండా హీరో హీరోయిన్ల తండ్రి పాత్రలో కూడా నటించి ఆకట్టుకున్నాడు. ఒకరకంగా లెజెండ్సినిమా తర్వాత టాలీవుడ్ లో బిజీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మారిపోయాడు జగపతిబాబు. అయితే ఇలా తన సెకండ్ ఇన్నింగ్స్ గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో జగపతిబాబు చేసిన కామెంట్స్ వైరల్ గా మారిపోయాయి. లెజెండ్ సినిమాతో వచ్చిన క్రేజ్ ను తాను సద్వినియోగం చేసుకోలేకపోయాను అంటూ చెప్పుకొచ్చాడు ఈ హీరో. నా పేరు అనౌన్స్ చేసినప్పుడు జగపతిబాబు విలన్ ఏంటి అన్నారు.


# ఎన్టీఆర్ ఇంటిముందు నిరాహార దీక్ష చేసైనా.. ఆ సీక్వెల్ కి ఒప్పిస్తా : కోన వెంకట్



తెలుగు హీరోయిన్ అంజలి టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం గీతాంజలి మళ్లీ వచ్చింది 2014లో కామెడీ అండ్ హార్రర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'గీతాంజలి' సినిమాకు ఈ చిత్రం సీక్వెల్‌గా రాబోతున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమాలో శ్రీనివాస్ రెడ్డి కథనాయకుడిగా నటిస్తుండగా.. సత్యం రాజేశ్, షకలక శంకర్, అలీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కోన వెంకట్ కథ, స్క్రీన్ ప్లేను అందిస్తుండగా.. శివ తుర్లపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నేడు హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఇక ఈ వేడుకలో మీడియాతో ముచ్చటించిన కోన వెంకట్ ఎన్టీఆర్ అదుర్స్ సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ సినిమా అనంతరం ఏ సినిమాను సీక్వెల్ తీయాలి అనుకుంటున్నారు అని కోన వెంకట్‌ను ఒక రిపోర్టర్ అడుగగా.. తనకు ఎన్టీఆర్‌తో 'అదుర్స్ 2' తీయాలని ఉందని తన మనసులో మాటను వెల్లడించాడు. ఈ సినిమాలో చారిగా ఎన్టీఆర్ చేసిన నటన ఇంకెవరు చేయలేరు. ఆ సినిమాకి సీక్వెల్ తీసుకు రావాలని నాకు ఎప్పటినుంచో ఉంది. ఆ సీక్వెల్ కథ రాసుకున్న తరువాత.. ఎన్టీఆర్ ఇంటిముందు నిరాహార దీక్ష చేసి అయినా ఎన్టీఆర్ ని ఆ సీక్వెల్ కి ఒప్పిస్తాను అంటూ కోన వెంకట్ చెప్పుకొచ్చారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది.

# అప్పటి వరకు ఎంత తిట్టినా పడతా

విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. 'గీతగోవిందం' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత పరశురామ్, విజయ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన రెండో చిత్రమిది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మించారు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం చిత్రబృందం అంతా ప్రమోషన్స్‌లో బిజీ అయిపోయింది. విజయ్ దేవరకొండ, దిల్ రాజు అటు తమిళ్‌లోనూ ఇటు తెలుగులోనూ తెగ ప్రచారం చేస్తున్నారు. ఇటీవల గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గీతగోవిందం' నా కెరీర్‌లో సూపర్ హిట్ మూవీ. ఇప్పటివరకు ఈ సినిమాను బీట్ చేసే మూవీ చేయలేదు. కెరీర్ ఆరంభంలో నేను నటించిన చిత్రం రూ. 100 కోట్లు కలెక్ట్ చేస్తే బాగుండని ఎన్నోసార్లు అనుకున్నాను. నా నాలుగో సినిమా గీతగోవిందంతోనే అది నిజమైంది. ఇటీవల నేను నటించిన ఓ సినిమా రూ.200 కోట్లు కలెక్ట్ చేస్తుందని చెప్పా. కానీ అది జరగలేదు. ఆ సమయంలో చాలా మంది నన్ను కామెంట్ చేశారు. అలాంటి స్టేట్‌మెంట్స్ ఎందుకు ఇస్తావని విమర్శించారు. నేను అలా స్టేట్‌మెంట్ ఇవ్వడం తప్పు కాదు. స్టేట్‌మెంట్స్ ఇచ్చి విజయం సాధించకపోవడం తప్పు. ఏదో ఒకరోజు ఆ స్థాయి కలెక్షన్స్ సాధిస్తా. అప్పటి వరకు మేరు ఎంత తిట్టినా పడతా. ఇప్పుడు కూడా నా మాటల్ని బలుపు అనుకుంటారు. కానీ.. నాపై నాకు ఉన్న నమ్మకం. అదే నమ్మకంతో చెప్తున్నా. ఇంకొకరు స్టార్ అయితే మనం అవ్వలేమా ఏంటీ.. నేను స్టార్ అయితే మీరు అవ్వలేరా ఏంటీ.. వాళ్లు రూ.200 కోట్లు కొడితే మనం కొట్టలేమా? ఏంటీ.. నేను కొడితే మీలో ఒకరు కొట్టలేరా ఏంటీ.. ఇదో జర్నీ.. మన లైఫ్‌లో ఎన్నో చూడాల్సి వస్తుంది. ఎన్నో అవమానాలు.. కిందకి లాగేవాళ్లని చూస్తుంటారు. వీటన్నింటినీ దాటుకుంటూ వెళ్లడమే జీవితం' అని విజయ్ అన్నారు.



# నవ్విస్తూ భయపెడుతున్న గీతాంజలి



థియేటర్‌లో ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించిన చిత్రం 'గీతాంజలి'. అంజలి ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ఇప్పటికి వచ్చి దాదాపు పదేళ్లు అవుతుంది. ఇన్నేళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' అనే సినిమా విడుదలకు ఇప్పుడు సిద్ధంగా ఉంది. తాజాగా ఈ చిత్రం నుంచి ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. శివ తుర్లపాటి తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని కోన ఫిల్మ్ కార్పొరేషన్, ఎంవీవీ సినిమా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఏప్రిల్ 11న ఈ చిత్రం విడుదల కానుంది. ఇందులో టైటిల్ పాత్రలో అంజలి పోషిస్తుండగా.. శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేశ్, అలీ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అంజలికి ఇది 50వ చిత్రం. ఈ చిత్రానికి కోన వెంకట్ కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చడం విశేషం. అంచనాలతో వచ్చిన ప్రేక్షకులు అంతకుమించి ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుందని కోన వెంకట్ చెప్పారు.

# సిద్ధూ కొత్త ప్రయోగం ఫలిస్తుందా?

టిల్లు స్క్వేర్ సినిమా ఫస్ట్ షోతోనే పాజిటివ్ టాక్ దక్కించుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబడుతోంది. నాలుగు రోజుల్లో ఈ సినిమా ఏకంగా రూ.78 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి.. రూ.100 కోట్ల దిశగా వెళుతోంది. ఇప్పటికే రూ.14 కోట్లకు పైగా లాభాలు వచ్చినట్లు సమాచారం తెలుస్తోంది.తెలుగు సినీ పరిశ్రమలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నా.. డీజే టిల్లు సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయారు సిద్ధు జొన్నలగడ్డ. ఆ క్యారెక్టర్ సినీ ప్రియులకు అంత బాగా నచ్చేసింది. ఇప్పుడు టిల్లు స్క్వేర్ సినిమాకు కూడా కనెక్ట్ అయ్యారు ఆడియన్స్. దీంతో ఇదే ఊపులో టిల్లు క్యూబ్ సినిమాను కూడా ప్రకటించేశారు మేకర్స్. ఇక సీక్వెల్ పై నెట్టింట జోరుగా చర్చ సాగుతున్న వేళ.. టిల్లు క్యూబ్ మూవీపై ఓ ఇంటర్వ్యూలో ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు హీరో సిద్ధు.టిల్లు ఫ్రాంచైజీలో డైనమిక్ మార్పులు చేయాలనుకుంటున్నట్లు హీరో సిద్ధు తెలిపారు. "డీజే టిల్లు మూవీ ఓ అమ్మాయి మోసం చేసే పాయింట్ చుట్టూ కథ తిరుగుతుంది. టిల్లు స్క్వేర్ సినిమా కూడా అదే పాయింట్ తో వచ్చింది. కానీ ఈ సారి టిల్లు క్యూబ్ లో టిల్లుకు సూపర్ పవర్స్ వస్తే ఏం చేస్తాడు? అనే పాయింట్ మీద కథ అంతా నడుస్తుంది" అని సిద్ధూ తెలిపారు. త్వరలోనే ఆ స్క్రిప్ట్ వర్క్ మొదలుపెడతానని సిద్ధూ అప్డేట్ కూడా ఇచ్చారు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com